# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 23, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## రైతు మెడకు ఉరితాడుగా కాంగ్రెస్



వివరాలు 2లో..

## రైతుల ఆందోళనతో కదిలిన సర్కార్..



### నేడో రేపో జూరాల నుంచి నీటి విడుదల

హైదరాబాద్/మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22 : ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం పోరాటానికి సర్కార్ తలవంచింది. కేటీఆర్ అల్టిమేటం, అన్నదాతల ఆందోళనతో ఎట్టకేలకు దిగొచ్చింది. జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నది. సమాంతర కెనాల్‌కూ నీటిని విడుదల చేసేందుకు సర్కార్ సంసిద్ధత వ్యక్తంచేసింది. బుధవారం లేదా గురువారం తెల్లవారుజామున నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్టు ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో హుటాహుటిన సెక్రటేరియట్‌లో మంగళవారం సీఎం భేటీ అయ్యారు. ఐదు రోజుల క్రితం ఐదు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ డిమాండ్ చేసినట్టే.. హడావుడిగా కర్ణాటక సీఎంకు లేఖ రాస్తూ ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయాలని కోరేందుకు బెంగళూరుకు వెళ్లిపోయారు. మరోవైపు రైతుల ఆక్రందనను చూసి సర్కార్ దిగిరాకపోవడంతో ప్రకృతి కనికరించి ఎగువన కురుస్తున్న వర్షాలకు గత 36 గంటలుగా 2,600 క్యూసెక్కుల వరద నీరు జూరాలకు వచ్చి చేరుతుండటం రైతాంగానికి శుభపరిణామం. మంగళవారం కూడా రైతులు పోరుబాట పట్టారు. పోలీసులు బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులను కొనసాగించారు. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న గోస చూసి బీఆర్ఎస్ రంగంలోకి దిగడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత పది రోజులుగా రైతులు ఆందోళన చేస్తుంటే.. 'ఒక్కసారి పంటలు పోతే ఏమైతది.. రైతుబంధు ఇచ్చాం కదా' అని రైతులను వెటకారం చేసిండో మంత్రి. జూరాల కింద నీళ్లివ్వలేమని మరో జిల్లా మంత్రి తేల్చిచెప్పిన వైనం. సాగునీటి కోసం మిగతా 3లో..

## జూరాల నీటి విడుదల నా చేతుల్లో లేదు

- ప్రాజెక్టులన్నీ ముఖ్యమంత్రే చూస్తున్నరు
- సీఎంవో జోక్యం లేకపోతే కథ వేరే ఉంటది
- మీ సీఎంను మీరే వెళ్లి అడగొచ్చు కదా!
- రేవంత్‌రెడ్డి ఆదేశిస్తేనే నీళ్లు వదులుతం
- కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి ఉత్తమ్ జవాబు
- ఇరిగేషన్ అధికారులకూ మంత్రి అల్టిమేటం



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు కింద ఎండిపోతున్న పంటలకు నీటి విడుదల చేసే అంశం తమ చేతుల్లో లేదని సాక్షాత్తు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే నడుచుకోవాల్సి వస్తుందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇదే విషయాన్ని ఓ ఎమ్మెల్యేతో అన డం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో జూరాల ప్రాజెక్టు అంశాన్ని డైవర్ట్ చేసేందుకు జిల్లా మంత్రులు శాయశక్తులా కృషిచేశారు. అయినా రైతాంగం పట్టువీడకుం డా ఆందోళనకు దిగడం.. బీఆర్ఎస్ మద్దతు మిగతా 3లో..

# అట్రాసిటీ బాధితులకు గ్రీన్ చానల్ ద్వారా సాయం

- బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా నిధులు
- అట్రాసిటీ, నిఘా, పర్యవేక్షణ కమిటీ సమీక్షలో సీఎం
- బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా నిధులు..
- సకాలంలో పరిహారం, పునరావాసానికి చర్యలు
- బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు
- గ్రామాలపై నిఘా పెట్టాలి: సీఎం రేవంత్



హైదరాబాద్,సెప్టెంబర్-22
రాష్ట్రంలోని దళితులు, గిరిజనులు, ఆదివాసీల సమగ్ర అభివృద్ధి, ఆత్మగౌరవం, పౌరహక్కుల పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రజా ప్రభుత్వం నిరంతరం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేవలం పథకాల కేటాయింపులతోనే సరిపెట్టకుండా నాణ్యమైన విద్య, స్థిరమైన ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సామాజిక సమానత్వం సిద్ధించి సమాజంలో గుణాత్మక మార్పు వస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై అణచివేతను, వివక్షను పూర్తిగా రూపుమాపేందుకు రాజకీయ విభేధాలను పక్కనబెట్టి అందరూ ఒకే వేదికపైకి వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని బడ్జెట్ కేటాయింపులతో మిగతా 3లో..

## ఈగల్ ఫోర్స్‌కు జాతీయస్థాయి గుర్తింపు




- డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీస్ శాఖ మరోసారి
- ఢిల్లీలో అవార్డు అందుకున్న ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ శాండిల్య
- అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్,సెప్టెంబర్-22
డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీస్ శాఖ మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రతిభ చాటుకుంది. తెలంగాణ ఈగల్ ఫోర్స్ చేపట్టిన సమన్వయ చర్యలు, దర్యాప్తు, నిరోధక కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు లభించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా న్యూఢిల్లీలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య మంగళవారం జాతీయస్థాయి పురసారం మిగతా 3లో..

# దాస్యంపై ఖాకీల ఓవరాక్షన్..

- ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డు పైకప్పు పెచ్చులూడి పలువురికి గాయాలు
- వారిని పరామర్శించి, హాస్పిటల్ సందర్శనకు బయల్దేరిన దాస్యం
- అప్పటికే హాస్పిటల్ మెయిన్ గేట్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు
- బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసులకు మధ్య తోపులాట, పరిస్థితి ఉద్రిక్తం
- నిలువరించే పేరుతో రెచ్చిపోయి దాస్యంపై పోలీసుల ప్రతాపం
- రెక్కలు విరిచి, మోకాలితో కడుపులో పిడిగుద్దులతో పైశాచికం
- బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్
- సిరికొండ మధుసూదనాచారి, బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శ
- తీవ్ర గాయాలతో ప్రైవేట్ దవాఖానకు.. ఫోన్ చేసి పరామర్శించిన కేటీఆర్



వరంగల్, సెప్టెంబర్ 22 : వరంగల్‌లో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌పై పోలీసులు ఓవరాక్షన్ చేశారు. ఎంజీఎం దవాఖానను సందర్శించేందుకు వెళ్తున్న ఆయనపై విచక్షణ లేకుండా దాడి చేసి రక్తం కండ్లజూశారు. భుజాలపై చేతులు వేసి, మోకాళ్లతో నెట్టడంతో 'అమ్మా.. అమ్మా' అని వినయ్ భాస్కర్ తల్లడిల్లుతున్నా.. పోలీసులు మాత్రం నిలువరించే పేరుతో కడుపులో పిడిగుద్దులు కురిపిస్తూ క్రూరంగా ప్రవర్తించారు. ఈ ఘటనలో వినయ్‌భాస్కర్ కాలు, చేయికి గాయాలై రక్తస్రావమైంది. తీవ్ర ఉద్రిక్తతలతో భయోత్పాతాన్ని సృష్టించిన ఈ ఘటన మంగళవారం వరంగల్‌లోని ఎంజీఎం సాక్షిగా చోటుచేసుకున్నది. రెండు రోజుల క్రితం(ఆదివారం) ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో రోగులు, వారి అటెండెంట్స్, సిబ్బంది గాయపడిన ఘటన మరువకముందే మంగళవారం ఆర్‌ఐసీయూ వార్డులో మరోసారి పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. విషయం తెలుసుకున్న వినయ్‌భాస్కర్ హాస్పిటల్ పరిస్థితులను పరిశీలించేందుకు ఎంజీఎం బయల్దేరారు. మిగతా 3లో..

## నిమ్స్ వైద్యుడి ఆస్తులు 80 కోట్లు..

- అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ నజర్
- ఏకకాలంలో 8 చోట్ల తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు
- కండ్లు చెదిరేలా మెడికల్ ఆఫీసర్ అక్రమాస్తుల చిట్టా వెలుగులోకి..
- అరకిలో బంగారు ఆభరణాలు, నగదు, ఖరీదైన కార్ల గుర్తింపు
- మ్యూచువల్ ఫండ్స్, ప్రైవేట్ సంస్థల్లోనూ భారీ పెట్టుబడులు
- రూ.1.33 కోట్లు వడ్డీకి ఇచ్చినట్టు తేల్చిన ఏసీబీ అధికారుల బృందం
- డీఆర్‌టీ వివాదాస్పద ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు

మిగతా 2లో..

## ఆర్థిక మంత్రికి నిరసనల స్వాగతం



హైదరాబాద్,సెప్టెంబర్-22 మూడు వ్యవసాయ బిల్లులపై అవగాహన కల్పించడానికి విజయవాడ వచ్చిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు నిరసనల స్వాగతం లభించింది. రైతాంగానికి నష్టం కలిగించే వ్యవసాయ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నిరసన ప్రదర్శన నిర్వహించిన వామపక్ష నేతలను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నిర్మలా సీతారామన్ మొగల్రాజపురంలో ఉన్న ఆదాయపన్ను శాఖ కార్యాలయానికి చేరుకునే సమయానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, సీపీఎం కేంద్ర నాయకులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు, రైతు సంఘం నాయకులు జమలయ్య తదితరులు ర్యాలీగా అక్కడికి బయలుదేరారు. పోలీసులు వారిని మధ్యలోనే అడ్డుకుని అరెస్టు చేసి, వాహనాల్లో గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టు..వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కారును అడ్డుకునేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి కాన్వాయ్ మొగల్రాజపురంలోని ఆదాయపన్ను శాఖ కార్యాలయానికి చేరుకున్న వెంటనే పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు నల్లరిబ్బన్లతో నినాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్నారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

## ముఖం చాటేస్తున్న రియల్టర్లు..

- హెచ్ఎండీఏ భూముల వేలానికి నిరాదరణ
- రెండో దశ వేలానికి కసరత్తు




హైదరాబాద్,సెప్టెంబర్-22
కోకాపేట్‌తోపాటు నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో హెచ్ఎండీఏ నిర్వహిస్తున్న భూముల వేలానికి ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. కోకాపేట్ నియోపోలిస్ లేఅవుట్‌లోని 17వ నంబర్ ప్లాట్‌లో ఉన్న 4.59 ఎకరాల భూమికి నిర్వహించిన వేలంలో ఒక్క బిడ్ మాత్రమే దాఖలు కావడంతో హెచ్ఎండీఏ వేలాన్ని రద్దు చేసింది. బహుళ అవసరాల జోన్‌లో ఉన్న ఈ లేఅవుట్‌లో ఇప్పటికే భారీ వాణిజ్య, నివాస, వ్యాపార ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో కోకాపేట్‌లో ఎకరాకు రూ.100 కోట్లకు పైగా ధర పలికిన నేపథ్యంలో, తాజా వేలంలోనూ భారీ ధర వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే సింగిల్ బిడ్ రావడంతో హెచ్ఎండీఏ పునరాలోచనలో పడింది. నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో లావాదేవీలు మందగించడం, భారీ పెట్టుబడుల విషయంలో వ్యాపారవర్గాలు ఆచితూచి వ్యవహరిస్తుం డటం వంటి అంశాలు భూముల వేలంపై ప్రభావం చూపు తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. భారీ ప్రాజెక్టుల విషయంలో అనుమతులు, నిర్మాణాలపై ఏర్పడుతున్న అనిశ్చితి కూడా పెట్టుబడిదారుల మిగతా 3లో..

## ఏపీలో రైతుల కేరింతలు..



### తెలంగాణలో రైతుల ఆక్రందనలు

### మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 22: విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగావాట్లకు 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ విజన్‌తో దేశంలో ఎక్కడా లేని విధంగా యాదాద్రి అల్ట్రా మెగా ధర్మల్ పవర్ ప్లాంట్ ను

## ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన..



- క్రికెట్ జట్టుకు ప్రధాని అభినందనలు..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్-22 'ఆసియా క్రీడలు-2026' లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంక ను 147 పరుగుల భారీ తేడాతో మిగతా 3లో..

## నగరంలో భారీ వర్షం..

- రోడ్లన్నీ జలమయం..
- స్తంభించిన ట్రాఫిక్
- చేతులెత్తేసిన జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు
- పొంగిపొర్లిన నాలాలు..

వివరాలు 3లో..



# వినయ్ భాస్కర్‌పై దాడి

**దాడిపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం**



హైదరాబాద్ (వరంగల్),సెప్టెంబర్-22 : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లోని పైకప్పు పెచ్చులు ఊడి గాయాలైన రోగుల పరిస్థితి తెలుసుకునేందుకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఎంజీఎం ఆసుపత్రిలో వెళ్లే క్రమంలో ఆయనను అడ్డుకున్న పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని తెలిసిందే. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వినయ్ భాస్కర్ కడుపులో తన్నారు. పోలీసులు కడుపులో తన్నారని, దాడిలో తన చేయి విరిగిందంటూ వినయ్ భాస్కర్ కంటతడి పెట్టుకున్నారు.కాగా ఈ ఘటనపై అక్కడే ఉన్న మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎం ఆసుపత్రి వద్ద వినయ్ భాస్కర్‌ను అడ్డుకొని దాడి చేసిన పోలీసుల తీరుపై మండిపడ్డారు. పోలీసు లకేంది.. ఎందుకు ఆపాలి.. వాళ్లను ఎందుకు కొట్లాలి. పోలీసులు ఎందుకు ఆపాలి వాళ్లను.. మనుషులా.. దున్నపోతులా..? ఆయన మా న్యాయం మాకు చేస్తుండు.. పోలీసోళ్లు కొట్టుడు అవసరమా..? వీళ్లను తీసేయాలంటూ ఫైర్ అయ్యారు. పోలీసుల దురుసు ప్రవర్తనపై బీఆర్ఎస్ నేతలతోపాటు స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

# కాంగ్రెస్ నేతలపై జగదీష్ రెడ్డి ఫైర్



హైదరాబాద్,సెప్టెంబర్-22

కాంగ్రెస్ సర్కార్ ఆదేశాలతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద వందలాది మంది పోలీసులు మోహరించిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా పోలీసులతో జగదీష్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం దిగ్బంధనం చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, విప్‌లు ఒకరి ప్రైవేట్ ఆస్తుల మీదికెళ్లడంపై జగదీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ దేశంలో ఉండే 542 పార్లమెంట్ సభ్యుల్లో మీరు కొందరు.. ఈ రాష్ట్రంలో ఉన్న శాసనమండలి సభ్యుల్లో, 119 మంది శాసనసభ్యుల్లో మీరు కొందరు..విప్‌లు, అధికార ప్రతినిధులు, పదవుల్లో ఉన్నవాళ్లు.. మీరందరూ కూడా అనుమతి లేకుండా ఒకరి ఆస్తుల దగ్గరకు పోకూడదని తెలియదా..? అనుమతి లేకుండా ఒకరి ఇంటికి పోవాలన్న సంగతి తెలియదా..? అని ప్రశ్నించారు. మీ ఇండ్లల్లకు కూడా ఎవరైనా వస్తే అనుమతిస్తారా..? అట్లా రావడం సరైందా..? ఏరకంగా పోయినరు.. ఏరకంగా ఈ పని చేశారు.. మీ అందరికీ ఈ ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాటు చేసినవాళ్లెవరు.. ఈ ఖర్చులు పెట్టిన వాళ్లెవరు.. ఇది ప్రభుత్వం నుంచి చేసిర్రా.. పార్టీలో చేసిర్రా.. లేదా భట్టి విక్రమార్క ప్రగతిభవన్‌లో నివసిస్తున్నరు.. కాబట్టి ఆయన ఏర్పాటు చేసిర్రా..? దీనివెనుకాల ముఖ్యమంత్రి ఉన్నడా.. ఎవరున్నరు.. ఎవరి ప్రోద్బలంతోని మీరంతా కూడా పోయారు. దీంట్లో ప్రభుత్వ ఖర్చు ఎంత..? ప్రజలకు చెప్పాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# 'రైతులకు న్యాయ పోరాటం కొనసాగిస్తాం'

**బీజేపీ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్**

**-- రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అరెస్ట్‌పై తీవ్ర నిరసన**



నకిరేకల్, సెప్టెంబర్ 22 : జూరాల ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లో వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నీటిని విడుదల చేయించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావును అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్ తీవ్రంగా ఖండించారు. రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా, రైతుల పక్షాన నిలబడి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై మచ్చ అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్, డిండి, ఎస్ఎల్‌బీసీ అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల పరిస్థితిపై స్పందించి, పంటలను కాపాడేందుకు అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# రైతుల మెడకు ఉరితాడుగా మారిన కాంగ్రెస్



- కరెంట్ కోతలపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ధ్వజం
- యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో డీఈ ఆఫీస్ ముట్టడి

చౌటుప్పల్, సెప్టెంబర్ 22 : కరెంట్ కోతలపై రైతులు భగ్గుమన్నారు. నిత్యం అనేక జిల్లాల్లో రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. మంగళవారం కూడా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలుచోట్ల సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనకు దిగారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ లోని విద్యుత్తు శాఖ డీఈ కార్యాలయాన్ని మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ముట్టడించారు. రోజుకు ఎన్ని గంటలు విద్యుత్తు సరఫరా చేస్తున్నారని డీఈని నిలదీశారు. డీఈ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

# దయ్యం పట్టిందని వృద్ధురాలిపై దాడి..

- సుమోటోగా స్వీకరించిన హెచ్చార్సీ



సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 22: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం జింకలగూడెంలో ఓ వృద్ధురాలిపై హింసకు పాల్పడిన ఆరోపణలను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి దయ్యం పట్టిందని అనుమానించిన కుటుంబసభ్యులు ఆమెను ఊరికి దూరంగా తీసుకెళ్లి చెట్టు ఎక్కించి కొరడాలతో కొట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. ఘటనకు సంబంధించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

# వినయ్ భాస్కర్‌పై దాడి ఘటన..

- మెడికో-లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలి :
- మాజీ ఎంపీ వినోద్ కుమార్



హైదరాబాద్ (వరంగల్),సెప్టెంబర్-22 : మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.దాస్యం వినయ్ భాస్కర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల నివేదికతో పాటు మెడికో-లీగల్ నివేదికను పరిగణనలోకి తీసుకుని, చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని వినోద్ కుమార్ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రత్యక్ష సాక్షులు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ఆయన సూచించారు.ఈ విషయంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని మాజీ ఎంపీ కోరారు. ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా, ఫిర్యాదులు మరియు వైద్య నివేదికల ఆధారంగా చట్టపరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు ప్రజలు, ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా పోరాటం చేశారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పాలన, శాంతియుత వాతావరణం తెలంగాణ సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అలాంటి రాష్ట్రంలో ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయని ఆరోపణలు రావడం, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారనే ఫిర్యాదులు రావడం ఆందోళనకర అంశమని అన్నారు.వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అసలు ఏం జరిగిందనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించాలని వినోద్ కుమార్ కోరారు. ఎవరి ప్రమేయం ఉన్నా, విచారణలో ఆధారాలు బయటపడితే వారికి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ ఘటనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని, బాధితుడి వాంగ్మూలం, వైద్య నివేదిక, మెడికో-లీగల్ నివేదికతో పాటు అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ పోలీసులను కోరారు. పోలీస్ కమిషనర్ ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సమగ్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాలని వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# నిమ్స్ వైద్యుడి ఆస్తులు 80 కోట్లు..

- అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ నజర్
- ఏకకాలంలో 8 చోట్ల తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు
- కండ్లు చెదిరేలా మెడికల్ ఆఫీసర్ అక్రమాస్తుల చిట్టా వెలుగులోకి..
- అరకిలో బంగారు ఆభరణాలు, నగదు, ఖరీదైన కార్ల గుర్తింపు
- మ్యూచువల్ ఫండ్స్, ప్రైవేట్ సంస్థల్లోనూ భారీ పెట్టుబడులు
- రూ.1.33 కోట్లు వడ్డీకి ఇచ్చినట్టు తేల్చిన ఏసీబీ అధికారుల బృందం
- డీఆర్‌టీ వివాదాస్పద ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు



హైదరాబాద్,సెప్టెంబర్-22 'లక్కీ భాస్కర్' సినిమా తరహాలో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ భారీగా అక్రమాస్తులు కూడబెట్టారు. సినిమా కథనే తలదన్నేలా ప్రైవేట్ సంస్థల్లో లక్షల రూపాయల పెట్టుబడులు, మ్యూచువల్ ఫండ్స్‌లో లక్షల ఇన్వెస్ట్‌మెంట్స్, ఖరీదైన కార్లు, కోటిన్నర వరకు వడ్డీలకు తిప్పుతూ.. కళ్లు చెదిరే ఫ్లాట్లలో తన అక్రమాస్తుల సామ్రాజ్యాన్ని విస్తరించారు. వివాదాస్పదుడిగా పేరుగాంచడం, అక్రమంగా డబ్బులు సంపాదిస్తుండటంతో ఏసీబీ అధికారులు ఆయనపై దృష్టిపెట్టి కూపీలాగారు. ప్రాథమిక పరిశీలనలోనే భారీగా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం తెల్లవారుజాము నుంచే ఎర్రగడ్డలోని కల్పతరువు అపార్ట్‌మెంట్స్‌లో ఆయన నివాసంతోపాటు ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలు, ఇతర సన్నిహితులకు సంబంధించిన 7 ప్రదేశాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అవినీతి, అక్రమాల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు.

# నీళ్లడిగితే రాజకీయం అంటారా?

- జూరాల కింద పంటలకు నీళ్లు ఇవ్వకుంటే
- రైతులు నష్టపోరా?: రాంచందర్‌రావు
- జూరాల కింద నీళ్లివ్వకుంటే రైతులు నష్టపోరా?: రాంచందర్



హైదరాబాద్,సెప్టెంబర్-22

"నీళ్లు అడిగితే రాజకీయం అంటారా? జూరాల ప్రాజెక్టు కింద సాగుకు నీళ్లివ్వమంటే.. తాగునీటి కోసం దాచిపెడుతున్నామని అంటున్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక ప్రభుత్వం నడుస్తోంది" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు వద్ద రైతులు చేపడుతున్న పోరాటానికి మద్దతుగా వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. మంగళవారం జూరాల ప్రాజెక్టు వద్దకు వెళుతూ మహబూబ్‌నగర్ జిల్లా గొల్లపల్లిలోని ఓ హోటల్ వద్ద రాంచందర్‌రావుతో పాటు పలువురు బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేసి జడ్చర్లలోని పోలీసు శిక్షణా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా సమస్యల వలయంలో చిక్కుకుపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. జూరాల ప్రాజెక్టు కింద సాగుచేసిన పంటలకు నీళ్లివ్వబోమనడం దుర్మార్గం అని మండిపడ్డారు. నీళ్లు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎగువన ఉన్న కర్ణాటకలోని నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల్లో 97.4వ నీటి నిల్వ ఉన్నదని, అందులో 5 టీఎంసీల నీళ్లు వదిలితే ఇక్కడి పంటలకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉన్నారని, జిల్లా రైతులను ఆదుకునే బాధ్యత ఆయనదేనన్నారు. కాగా, కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంత ప్రాజెక్టుల్లో నీరున్నా పంటలు ఎండబెడతారా? అని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఇంత మూర్ఖపు ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని దుయ్య బట్టారు.

# ఓయోకు వెళ్లిన జంట..

- అర్ధరాత్రి హోటల్ గదిలో యువతి మృతి.. ప్రియుడు పరార్..




హైదరాబాద్, సెప్టెంబర్ 22: హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. సిద్దిఖీ నగర్‌లోని రోడ్ నంబర్-5లో ఉన్న ఓయో హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని విశాఖపట్నానికి చెందిన షారోన్ నిఖితా టోప్నో అనే యువతి తన ప్రియుడు శ్రీనివాస రవితేజతో కలిసి ఓయోలో రూం బుక్ చేసుకుంది. ఇద్దరూ మోటల్‌లో చెక్ ఇన్ అయ్యారు. అయితే అర్ధరాత్రి సమయంలో హోటల్ సిబ్బంది వద్దకు వచ్చిన రవితేజ.. తనతో వచ్చిన యువతి అపస్మారకస్థితిలోకి వెళ్లిందని తెలిపాడు. సిబ్బంది సాయంతో ఆమెను కొండాపూర్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే యువతి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు విచారణ చేపట్టారు. యువతి ముఖం, తల భాగంలో గాయాలు, వాపులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో హోటల్‌లో జంట బుక్ చేసుకున్న 303వ గదిని పరిశీలించగా గోడలు, బెడ్‌షీట్‌పై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. గదిలో ఖాళీ బీర్, విస్కీ బాటిళ్లు కూడా లభించాయి.కాగా, యువతి మృతి చెందిన విషయం తెలియగానే ఆమె ప్రియుడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో అతని ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. అతని ఫోన్ చివరి లొకేషన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో నమోదైందని.. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు సమాచారం.

## (మొదటిపేజీ తరువాయి)

# రైతుల ఆందోళనతో కదిలిన సర్కార్..

రైతులు తండ్లాడుతుంటే.. బర్త్‌డే సెలబ్రేషన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే మునిగిపోవడంపై రైతుల నిరసన మరింత పెల్లుబికింది. బీఆర్‌ఎస్ ఇచ్చిన 'చలో జూరాల' పిలుపు రాష్ట్ర సర్కార్‌ను ఒక్క కుదుపు కుదిపేసింది. కుడి, ఎడమ కాలువలతోపాటు పేరలాల్ కెనాల్‌కు సాగునీటిని విడుదల చేయాల్సిన సర్కార్ చోద్యం చూస్తున్నది.

# గ్రీన్ చానల్ ద్వారా సాయం

ముడిపెట్టకుండా వెంటనే విడుదల చేసేందుకు 'గ్రీన్ చానల్' ద్వారా నిధులు కేటాయించాలని, సకాలంలో ఆర్థిక సహాయం, పునరావాసం దక్కేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం-1989 అమలు తీరుతెన్నులపై ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ కీలకమైన సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతోపాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన చివరిసారిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగిందని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించకపోవడం శోచనీయమని అన్నారు. ఈ సమీక్ష జరగడం, దళిత, గిరిజన వర్గాల భద్రత, సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న ఉన్నతమైన ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు.

# దాస్యంపై ఖాకీల ఓవరాక్షన్..



అప్పటికే హాస్పిటల్ ప్రాంగణాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. హాస్పిటల్ మెయిన్ గేట్ వద్ద పోలీసులు మోహరించిన విషయాన్ని తెలుసుకున్న దాస్యం వినయభాస్కర్, మాజీ కార్పొరేటర్లు వద్దిరాజు గణేశ్, జోరిక రమేశ్, పార్టీ నేతలు సదాంత్ తదితరులు హాస్పిటల్ వెనుక వైపున్న మార్చురీ నుంచి లోపలికి వెళ్లేందుకు ఉపక్రమించారు. అక్కడ వారిని అడ్డుకున్నారు. ముందుగా వినయ్‌భాస్కర్‌ను చుట్టుముట్టి, లోపలికి వెళ్లేందుకు వీల్లేదని వారించారు. 'మేం హాస్పిటల్‌లోకి వెళ్లకూడదా? రోగులను పరామర్శించకూడదా? మమ్మల్ని లోపలికి వెళ్లనీయండి, ఎందుకు వెళ్లనీయడం లేదు' అంటూ పోలీసులను ప్రశ్నిస్తూ వినయ్‌భాస్కర్ ముందుకు కదిలారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్‌ఎస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగి వినయ్‌భాస్కర్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన కాలికి, చేయికి గాయాలయ్యాయి. ఒక దశలో తన చేయి విరిగిందంటూ కంటతడి పెట్టుకున్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కాంగ్రెస్ ప్రజాపాలనా? అని నిప్పులు చెరిగారు. మరోవైపు బీఆర్‌ఎస్ నాయకులను మార్చురీ గేట్ నుంచి ఈడ్చుకెళ్లి గేటుకు తాళం వేశారు. అనంతరం దాస్యంను నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, తనకు ఎంజీఎంలోనే చికిత్స చేయించాలని ఆయన పట్టుబట్టారు. పోలీసుల తీరుపై రోగుల బంధువులు మండిపడ్డారు. దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పోలీసుల తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ కార్యకర్తలు మార్చురీ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ముఖం చాటేస్తున్న రియల్టర్లు..

నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నట్లు పేర్కొంటున్నాయి.

### రెండో దశ వేలానికి కసరత్తు

వేలానికి స్పందన తగ్గినప్పటికీ హెచ్‌ఎండీఏ మరో విడత భూములను వేలం వేసేందుకు కసరత్తు చేస్తోంది. కోకాపేట్‌తోపాటు లేమూరు, ఇస్మాయిల్‌నగర్, బాచుపల్లి, మోకిలా ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్లను వేలం వేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. కోకాపేట్‌లోని 4.59 ఎకరాల ప్లాట్‌కు మరోసారి వేలం నిర్వహించి సుమారు రూ.1,000 కోట్ల వరకు ఆదాయం సమీకరించాలనే లక్ష్యంతో హెచ్‌ఎండీఏ ఉన్నట్లు తెలుస్తోంది.

# ఈగల్ ఫోర్స్‌కు జాతీయస్థాయి గుర్తింపు

అందుకున్నారు. న్యూఢిల్లీలో ఈ నెల 22, 23 తేదీల్లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడో జాతీయ స్థాయి యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్) అధిపతుల సమావేశంలో గుర్తింపు లభించింది. 7 అంశాల్లో దాదాపు 80 మార్కు లు రావడంతో జాతీయస్థాయిలో గుర్తింపు దక్కింది. జాతీయస్థాయి గుర్తింపుతో డీజీపీ సీవీ ఆనంద్ ఈగల్ ఫోర్స్‌ను అభినందించారు.

# ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన..

ఓడించి వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ చారి త్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయమని అన్నారు. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడారు. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘమని, ఈ విజయంతో దేశం గర్విస్తోందని అన్నారు. స్వర్ణం గెలిచిన జట్టు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ.. షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు.

## జూరాల నీటి విడుదల నా చేతుల్లో లేదు

తెలుపడంతో పరిస్థితి చేయిదాటిపోయింది. చివరకు డైవర్షన్స్ బెడిసి కొట్టడంతో జూరాల నీటి విడుదల అంతా తామే చేసినట్టు.. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వా న్ని ఒప్పించినట్టు బిల్డప్ ఇచ్చేందుకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు నానా తం టాలు పడుతున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పర్యటించిన కేటీఆర్ జూరాల ప్రాజెక్టు కింద ఎకరా ఎండినా సర్కార్‌ను వదిలి పెట్టేది లేదని ఇచ్చిన అల్టిమేటమ్ పెద్ద దుమారం లేపింది. ఆ తరువాత రైతుల వరుస ఆందోళనలు కాంగ్రెస్ పార్టీ కి పెద్ద షాక్ ఇచ్చాయి. తొలుత ఈ ఆందోళనలను కాంగ్రెస్ సర్కార్ పట్టనట్టు వ్యవహరించగా.. దీన్ని డైవర్షన్ చేసేందుకు జిల్లా మంత్రులు శాయశక్తులా కృషిచేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాత్రం.. ఒకసారి పంటలు వదులుకుంటే ఏమైతదని రైతులను చులకన చేసి మాట్లాడారు. మంత్రి జూపల్లి అయితే ఏకంగా జూరాల అయినా రైతాంగం మొక్కవోని ధైర్యంతో ఇటు గద్వాల అటు వనపర్తి జిల్లాల్లో ఆందోళనలు చేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే సాగుపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కోరగా.. 'మా చేతిలో ఏమీ లేదు.. ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాలి. ప్రాజెక్టులన్నీ ఆ య న చేతుల్లోనే ఉన్నాయి. నేనేమి చేయలేను' అంటూ చేతులెత్తేశారు.

# నగరంలో భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం..

- స్తంభించిన ట్రాఫిక్
- చేతులెత్తేసిన జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు
- పొంగిపొర్లిన నాలాలు.. ముందస్తు చర్యల్లో విఫలం
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహన దారులు





**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం అవడంతో పెద్ద ఎత్తున ఉరుముతూ మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి భగభగమండిన ఎండతో ఉక్కపోతకు నగరవాసులు ఊపిరిపీల్చుకున్నారు. ఒక్క రోజు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమ య్యా యి. ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అసెంబ్లీ, సైఫాబాద్, లిబర్టీ, ట్యాంక్‌బండ్, ముషీరాబాద్, చిక్కడపల్లి, మలక్‌పేట్, పంజాగుట్ట, బంజారాహిల్స్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, బోరబండలో భారీ వర్షం కురిసింది. సాయంత్రం సమయం కావడంతో ఆఫీసుల నుంచి బయటకు వచ్చిన ఉద్యోగులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సి వచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో మరో రెండు రోజులు నగరంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నగరానికి వాయుగుండం ఎఫెక్ట్ ఉందని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. రోడ్లపై నాలాలు పొంగిపొర్లడంతో వాహనదారులు ఆ మార్గాలను దాటడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూడళ్ల వద్ద, ట్రాఫిక్ ప్రాంతాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వచ్చింది. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద రోడ్లు చెరువులను తలపించడంతో వాహనదారులు ఆ మార్గాలను దాటడానికి సాహసించలేకపోయారు.

# నిమ్స్‌లో ఏసీబీ కలకలం..

- డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ ఇంట్లో సోదాలు
- ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ ఆరోపణలు
- మొట్టమొదటిసారి సర్వీసులో ఉన్న అధికారిపై దాడులు
- సంబంధిత మంత్రి పీఏ, మాజీ డైరెక్టర్లతో కలిసి అక్రమాలు
- ఔట్‌సోర్సింగ్, స్కిల్డ్ ఉద్యోగాల్లో కోట్ల రూపాయల వసూళ్లు
- రోబోటిక్ టెక్నాలజీ, వైద్య పరికరాలు కొనుగోళ్లలో కమీషన్లు




**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** ఎర్రగడ్డలో లక్ష్మీభాస్కర్‌కు చెందిన కల్పతరువు అపార్ట్‌మెంట్స్ సహా ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు, బంధువుల నివాసాల్లోను సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి పలు చోట్ల తనిఖీలు చేశారు. నిమ్స్‌లో ఫైల్స్ పరిశీలించారు. ఇప్పటికే కొన్ని అక్రమాస్తులు గుర్తించినట్లు సమాచారం. నిమ్స్ చరిత్రలో ఒక అధికారిపై మొట్టమొదటిసారిగా ఏసీబీ దాడులు జరిగాయని, గతంలో రిటైర్డ్ ఉద్యోగులపై జరిగినప్పటికీ సర్వీసులో ఉన్నవారిపై జరగడం ఇదే మొదటిసారి అని నిమ్స్ ఉద్యోగులు తెలిపారు. లక్ష్మీభాస్కర్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయని, ఆయనపై గతంలోనే కేసులు ఉండగా, నిమ్స్‌లో జరిగే ప్రతి పనిలోను లక్ష్మీభాస్కర్‌కు ముడుపులు ముట్టనిదే ఆ పని జరగదని ఆయనను ఎవరైనా వ్యతిరేకిస్తే వారిపై అధికారికంగా, రాజకీయంగా ఒత్తిడి చేయించి ఇబ్బందులు పెడుతారని పలువురు ఉద్యోగులు చెప్పారు. లక్ష్మీభాస్కర్ నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సమయంలోనే సంస్థలో నియామకాల విషయంలో పెద్ద ఎత్తున లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నా యి. ఈ వ్యవహారంలో లక్ష్మీభాస్కర్‌తో పాటు సంబంధిత శాఖ మంత్రి పీఏ, మాజీ డైరెక్టర్ కూడా భాగస్వాములయ్యారని వారి సహకారంతోనే నియామకాలు కొనుగోళ్లు, కాంట్రాక్టుల్లో పెద్ద ఎత్తున వసూళ్లు చేశారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా నిమ్స్‌లో 440 అన్‌స్కిల్డ్ ఉద్యోగులను నియమించారని, వీరంతా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకమైనవారు కాగా వీరిలో ఒక్కొక్కరి దగ్గర సుమారు లక్షన్నర నుంచి రెండులక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. మరో 81 స్కిల్డ్ ఉద్యోగుల నియామకాల్లో ఒక్కొక్కరి దగ్గర రూ.5లక్షలు వసూలు చేసినట్లు నిమ్స్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. సుమారు 8వందల మందిని ఒక్కొక్కరి దగ్గర రెండు నుంచి ఐదు లక్షల వరకు వసూలు చేసి తీసుకుని నియామకం చేశారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఇందులో కూడా మాజీ డైరెక్టర్ సంతకానికి ఒక రేటు పెట్టి ఆ రేటు ప్రకారమే డబ్బులు ఇచ్చారని, ఇక మంత్రి పీఏకు వాటాలు పంపి అందరిని మేనేజ్ చేస్తూ వందల కోట్ల ఆస్తులు సంపాదించారంటూ లక్ష్మీభాస్కర్‌పై గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇది మాత్రమే కాకుండా మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లు, కాంట్రాక్టర్లకు పనులు కేటాయించి వారి దగ్గర నుంచి కమీషన్లు తీసుకోవడం వంటి ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఈ మొత్తం దందాలో లక్ష్మీభాస్కర్‌తో పాటు మంత్రి పీఏ, మాజీ డైరెక్టర్ కూడా ఉన్నారని లక్ష్మీభాస్కర్ చేసిన అక్రమాలకు మాజీ డైరెక్టర్ వంత పాడి సంతకాలు పెట్టిన కారణంగా ఆయనకు కావలసినంత ముడుపులు ముట్టాయని నిమ్స్‌లో చెప్పుకుంటున్నారు. ఇటీవల నిమ్స్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోబోటిక్స్ టెక్నాలజీ విషయంలో కూడా తమ వాటాలు అందిన తర్వాతనే వెలుగులోకి రానిచ్చారంటూ నిమ్స్‌లో ఒక కీలక అధికారి తెలిపారు. అంతేకాకుండా లక్ష్మీభాస్కర్ నిమ్స్‌లో కొందరు మహిళలు, పేషెంట్ల బంధువుల పై వ్యవహరించే తీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఎంజీఎం ఆస్పత్రికి నిధులు ఖర్చు చేయలేదు..

- ఒప్పుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహిస్తుందో స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేసిన కామెంట్స్ చెప్పకనే చెబుతున్నాయి. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లోని పైకప్పు పెచ్చులు ఊడిన విజువల్స్ నెట్టింట వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగంలో పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. అయితే ఆ టైంలో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెను పెను ప్రమాదం తప్పింది. ఇదిలా ఉంటే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి నిధులు ఖర్చు చేయడంలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా ఒప్పుకున్నారు. ఎమ్మెల్యే నాయిని మీడియాతో మాట్లాడుతూ.. ఎంత చెప్పినా ఏది చేసినా.. డాక్టర్లు కానీ ఇంకొందరి స్వార్థాలకు నిజంగా ఎంజీఎం ఆస్పత్రి నిర్లక్ష్యం అవుతోంది. నిన్ననే సీఎం రివ్యూ కూడా చేశారు. ఇంకా నిర్లక్ష్యం ఏందంటే టిమ్స్ ఆస్పత్రి ప్రారంభమవుతుంది కదా.. ఇందులోకి మారుస్తున్నం కదా.. అని దాన్ని మరమ్మత్తు చేయించడానికి కూడా నిధులు ఖర్చు చేయలేదు.. అందుకే ఎంజీఎం ఆస్పత్రి ఇలాంటి దుస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ఈ వీడియో మరోసారి స్పష్టం చేస్తోంది.

# జూబ్లీహిల్స్ సీఐకి ఊరట



**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్ వేటు పడిన జూబ్లీహిల్స్ మాజీ ఎస్‌హెచ్‌వో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు శ్రీనివాసు లురెడ్డిని అరెస్టు చేయవద్దని, అతడిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని నగర పోలీ సులను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వు లు జారీ చేసింది. మంగళవారం ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఓ మహిళను జూబ్లీహిల్స్ మాజీ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసులు రెడ్డి లైంగికంగా వేధించడమే కాకుండా ఆమెను బ్లాక్ మెయిల్ చేసి బలవంతంగా అబార్షన్ చేయిం చాడంటూ తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యం లో ఇటీవల అతడిపై సస్పెన్షన్ వేటు వే శారు.

## సర్దుబాటు టీచర్లు విధుల్లో చేరకపోతే చర్యలే..



### పాఠశాల విద్యాశాఖ హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** మిగులు టీచర్ల సర్దుబాటులో భాగంగా ఇతర స్కూళ్లకు కేటాయించిన టీచర్లు రిపోర్ట్ చేయకపోతే సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ హెచ్చరించారు. సర్దుబాటు చేసిన టీచర్లు విధుల్లో చేరారా.. ? లేదా..? అన్నది పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని డీఈవోలను ఆదేశించారు.

## విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఫెయిల్ : మల్క కొమురయ్య

**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** సర్కార్ బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తగ్గడంపై టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ఒకటో తరగతిలో 2019-20తో పోల్చితే 2025-26లో 45,978 మంది తగ్గడంపై ఆవేదన వ్యక్తంచేశారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిలయ్యారని.. 20% అడ్మిషన్లు తగ్గడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నదని మండిపడ్డారు. వేలాది మంది టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. విద్యారంగంపై సీఎం సమీక్షించి.. కారణాలు అన్వేషించి సర్కార్ బడుల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించారు.

## ఎర్రగడ్డ దవాఖాన నుంచి ఖైదీ పరార్

### పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న నిందితుడు



**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** పోక్సో కేసులో అరెస్టైన నిందితుడు ఎర్రగడ్డ మానసిక దవాఖాన నుంచి పోలీసు ఎస్కార్ట్ కళ్లుగప్పి తప్పించుకున్న ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బోరబండ పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా అమరచింతకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కిశోర్ కుమార్ రెడ్డి పోక్సో కేసులో అరెస్టై చంచల్ గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. వైద్య పరీక్షల కోసం మంగళవారం హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరెడ్డి, కానిస్టేబుల్ రాహుల్ అతడిని ఎర్రగడ్డలోని మానసిక దవాఖానకు తీసుకువచ్చారు. వైద్య పరీక్షల అనంతరం బాత్‌రూమ్‌కు వెళ్తానని చెప్పిన కిశోర్ కుమార్ రెడ్డి అకడికి వెళ్లి వెంటిలేటర్ నుంచి దూకి పరారయ్యాడు. పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ దొరకలేదు. ఎస్కార్ట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నారు.

## తాగునీరు వృథా.. పలువురికి జరిమానా

**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** తాగునీటితో ఫ్లోర్లు, వాహనాలు కడగటం, అవసరం లేకున్నా నల్లాలను తెరిచి ఉంచడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిండిపోయి నీరు పొంగిపోతున్నా పట్టించుకోకపోవడం వంటి చర్యల వల్ల విలువైన తాగునీరు వృథా అవుతున్నదని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈమేరకు జూబ్లీహిల్స్ ప్రాంతంలో జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాగునీటిని వృథా చేస్తున్న ఐదుగురు వినియోగదారులను గుర్తించి జరిమానా విధించారు. ఈసందర్భంగా ఒక్క నిమిషంలోనే ఎంత నీరు వృథా అవుతుందో కరపత్రాల ద్వారా వివరించారు. ఇక నుంచి తాగునీటి వృథాపై జలమండలి కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. నగర వ్యాప్తంగా నీటి సరఫరా సమయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# హార్మూజ్ జలసంధిని 7 రోజుల్లో ఓపెన్ చేస్తాం..

## కానీ: ఇరాన్ కీలక ప్రకటన



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇక ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్- అమెరికా యుద్ధంతోపాటు అటు రష్యా- ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే హార్మూజ్ జలసంధిపై ఇరాన్ తాజాగా కీలక ప్రకటన చేసింది. తాము ఏడు రోజుల్లో హార్మూజ్ జలసంధిని రీ ఓపెన్ చేస్తామని కానీ హార్మూజ్ లో అమెరికా సైన్యం వెనక్కు వెళ్లాలని.. అలాగే ఇరాన్ పోర్టుల్లో బ్లాకేడ్ ను తొలగించాలని విజ్ఞప్తి చేసింది. రాయిటర్స్ అండ్ జపాన్ కు చెందిన క్యోడో న్యూస్ ఏజెన్సీ తెలిపిన వివరాల ప్రకారం ఇరాన్ ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఇరాన్ కు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపిన వివరాలను రాయిటర్స్, క్యోడో న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. హార్మూజ్ జలసంధిని తెరిచేందుకు అవసరమైన షరతులను టెహ్రాన్ నిర్దేశించిందని అలాగే మిడిల్ ఈస్ట్ లో దాదాపు ఏడు నెలల యుద్ధం తర్వాత ఇరాన్ ఆర్థిక పరిస్థితి, ట్రంప్ సర్కార్ దూకుడు తదితర అంశాలను వివరించింది. ఇక ఇటీవలి కాలంలో హార్మూజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ మిలిటరీపై ట్రంప్ సర్కార్ ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. అందువల్లే అమెరికా మిలిటరీ హార్మూజ్ ను వీడాలని అప్పుడే ఆ జలసంధిని ఓపెన్ చేస్తామని కీలక ప్రతిపాదన తీసుకొచ్చింది.

ఇక ప్రపంచ వ్యాప్తంగా సముద్రాల మార్గం గుండా జరిగే మొత్తం చమురు రవాణాలో దాదాపు 20 నుంచి 30 శాతం వరకు హార్మూజ్ జలసంధి గుండానే సాగుతుంది. హార్మూజ్ జలసంధి నుంచి వెళ్లే అత్యధిక శాతం అంటే దాదాపు 80 శాతానికి పైగా చమురు ఆసియా దేశాలకే వెళ్తుంది. ముఖ్యంగా భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు తమ ఇంధన అవసరాల కోసం హార్మూజ్ జలసంధిపైనే అధికంగా ఆధారపడుతుంటాయి. ఇదిలా ఉంటే సౌదీ అరేబియా- హౌతీ రెబల్స్ మధ్య ఉద్రిక్తమైన వాతావరణం నెలకొంది. తాజాగా బాబ్ అల్ మండేబ్ సమీపంలోని ఓ స్థానిక మార్కెట్ ను లక్ష్యంగా చేసుకుని సౌదీ అరేబియా వైమానిక దాడి జరిపిందని హౌతీ దళాలు పేర్కొన్నాయి. అంతకుముందు హౌతీ దళాలు.. సౌదీ అరేబియా రియాద్ లోని ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ పై దాడులు చేపట్టిన విషయం తెలిసిందే.

# ఏపీలో పట్టణాలకు మహర్దశ..

- రూ.11,359 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం!

హైదరాబాద్, సెప్టెంబర్ 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఏపీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణాల రూపురేఖలు మార్చేలా భారీ అభివృద్ధి పనులకు నేడు కీలక అడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా రూ. 11,359 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ నావీ విధానంలో ప్రారంభించారు. రాష్ట్రంలో తొలిసారి ఇంత విస్తృత స్థాయిలో నావీ మోడల్‌లో చేపట్టిన పట్టణ అభివృద్ధి కార్యక్రమంగా చెప్పవచ్చు. మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల్లోని 106 నియోజకవర్గాలకు చెందిన 123 మున్సిపాలిటీల్లో ఈ పనులు ఏకకాలంలో మొదల వుతున్నాయి. ఏపీలోని పట్టణాలలో రోడ్ల అభివృద్ధికి రూ. 4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్లకు రూ. 88 కోట్లు, స్ట్రీట్ లైటింగ్‌కు రూ. 247 కోట్లు, పార్కులకు రూ. 509 కోట్లు కేటాయించారు. దీంతో సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల మీడియన్లు, 391 కిలోమీటర్ల వీధి దీపాలు, 300కిలోమీటర్ల సీవరేజ్ పనులు పూర్తికానున్నాయి. పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా నావీ విధానం ద్వారా ప్రభుత్వం, ప్రైవేట్ పెట్టుబడులతో పనులు చేపడతారు. సీఎం చంద్రబాబు కుప్పం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణాల్లో రోడ్లు, లైటింగ్, పార్కులు, పారిశుధ్యం మెరుగుపరచి ప్రజల జీవన ప్రమాణాలు పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందింది. కుప్పం నియోజకవర్గం కడపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన చంద్రబాబు రాష్ట్ర మున్సిపల్ చరిత్రలో ఈ రోజు సువర్ణ ధ్యాయ మన్నారు. పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపల్ శాఖ మంత్రి, అధికారులను అభినందించారు. రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితు లనుఎదుర్కొని అభివృద్ధి దిశగా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు.

# "తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా విమానాశ్రయాల నిర్మాణాలు ఉండాలి"






హైదరాబాద్, సెప్టెంబర్ 22: రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయ పనుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి తాజాగా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు అలాగే ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా ఉండాలని తెలిపారు. తెలంగాణ సంస్కృతి ప్రతిరూపాలైన కాకతీయ కళాతోరణం, పిల్లలమర్రి, రామప్ప ఆలయం ప్రతిబింబించేలా ఉండాలని అధికారులకు సూచనలు చేశారు. ఈమేరకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు నిర్మించే ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహం మార్పు, రహదారుల మళ్లింపు, బీఎస్ఎన్ఎల్ లైన్లు, తాగు నీటి సరఫరా లైన్ల మార్పు అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆయా అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులు నిర్మించాలని, ఆ రహదారులను సమీప జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని సూచించారు. ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే, అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యుత్, ఆర్ అండ్ బీ, తాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ అధికారులు సమావేశమై బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించి, ఏకకాలంలో పనులు సాగేలా చూడాలని సూచనలు చేశారు. ప్రస్తుత అవసరాలనే కాకుండా భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని పనులు ముందుకు సాగేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే, విమానాశ్రయాల ప్రాంగణం లేదా సమీపంలో చెరువులను నిర్మించి, అక్కడి నుంచి ప్రవాహాలను మళ్లించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండడంతో పాటు సమీపంలోని ముఖ్య రహదారులకు అనుసంధానించేలా నిర్మించాలని సీఎం ఆదేశించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి నిర్మాణంలోనూ తెలంగాణ సంస్కృతి, శిల్ప, వాస్తు కళలకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. పలు ఆకృతుల్లో మార్పులను సీఎం సూచించారు.

## ఆరుగురు రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ నోటీసులు




హైదరాబాద్, సెప్టెంబర్ 22: సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విధులకు గైర్హాజరైన ఆరుగురు సిబ్బందికి కలెక్టర్ ప్రియాంక అలా నోటీసులు జారీ చేశారు. ఈమేరకు మంగళవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే పౌరులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

# కొత్త పెన్షన్స్ ఇచ్చేందుకు ముహూర్తం ఫిక్స్!







హైదరాబాద్, సెప్టెంబర్ 22: తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వస్తుంది. ముఖ్యంగా నిరుపేదల జీవితాలలో వెలుగు నింపే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా చాలా కాలంగా కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న లబ్దిదారులకు శుభవార్త చెప్పింది. త్వరలో వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు పచ్చ జెండా ఊపింది. పేదలకు, అర్హులైన కుటుంబాలకు దసరా పండుగకు ముందే తీపి కబురు చెప్పింది. కొత్త పెన్షన్ల పంపిణీని అక్టోబర్ నెల నుంచే ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అర్హులైన నిరుపేదలకు ఊరట కలిగించేలా వెరిఫికేషన్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు, వివిధ వర్గాల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో త్వరగా పరిశీలించాలని కలెక్టర్లు, అధికారులను కోరింది. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని జాబితాలు సిద్ధం చేయాలని స్పష్టం చేసింది. దసరా నాటికి అర్హుల ఖాతాల్లో సొమ్ము జమ కావాలని లక్ష్యం పెట్టుకుంది. ఈ దఫాలో తెలంగాణా ప్రభుత్వం ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఏ ఒక్క అర్హురాలూ నష్టపోకుండా పారదర్శకంగా పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వం సూచించింది. వృద్ధాప్య, వికలాంగ, చేనేత, గీత కార్మికుల వంటి వర్గాల అర్జీలను కూడా వేగంగా పరిశీలించనున్నారు. రాజకీయ జోక్యం లేకుండా కేవలం నిబంధనలు, అర్హతల ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. జిల్లా కలెక్టర్లు మండలాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ పనులను ముమ్మరం చేస్తున్నారు. పండుగ వేళ పేద కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులు తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక ఈ విషయాన్ని మంత్రి సీతక్క వెల్లడించారు. రాబోయే దసరా పండుగకు ముందే ఒంటరి మహిళలు, వితంతువులకు కొత్త సామాజిక పింఛన్లు పంపిణీ చేసేలా క్షేత్రస్థాయి పరిశీలనను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని కేటాయించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌ను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకంలో భాగంగా అర్హులైన అభ్యర్థులందరికీ త్వరలోనే పింఛన్లు అందుతాయని హామీ ఇచ్చారు.

# ఖైరతాబాద్ బడా గణేశ నిమజ్జనం టైమ్ ఫిక్స్..

## రేపు రాత్రి వరకే దర్శనాలు..

హైదరాబాద్, సెప్టెంబర్ 22: హైదరాబాద్ లో గణేష్ నవరాత్రులు కోలాహలంగా జరుగుతు న్నాయి. గల్లీ గల్లీకి గణేష్ మండపాలతో.. డీజే పాటలతో హోరెత్తుతున్నాయి. మరోవైపు గణేష్ నిమజ్జనాలు కూడా ఊపందుకున్నాయి. ఈ మేరకు జీహెచ్ ఎంసీ, పోలీస్ యంత్రాంగం అలాగే ఇతర ప్రభుత్వ శాఖలు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇక హైదరాబాద్ కా రాజా ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 25 వ తేదీ శుక్రవారం అనంత చతుర్దశి పర్వదినం సందర్భంగా ఖైరతాబాద్ మహా గణపతితోపాటు నగరవ్యాప్తంగా ఉన్న వేలాది విగ్రహాలు నిమజ్జన శోభాయాత్ర ఘనంగా సాగనుంది. గతేడాది మాదిరి కాకుండా ఈ సారి నిమజ్జనం ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇక ఇప్పటికే 3 కార్పొరేషన్ల పరిధిలో లక్షకుపైగా విగ్రహాల నిమజ్జనాలు పూర్తయినట్లు సమాచారం. ఇక ఖైరతాబాద్ వినాయకుడి దర్శనాలు సెప్టెంబర్ 23 వ తేదీ బుధవారం రాత్రితో ముగియనున్నాయి. ఈ మేరకు గణేష్ ఉత్సవ కమిటీ తెలిపింది. అలాగే సెప్టెంబర్ 24 న షెడ్లు, బారికేడ్ల తొలగింపు తదితర కార్యక్రమాలను పూర్తి చేయనున్నారు. ఇక సెప్టెంబర్ 25 న ఉదయం 6 గంటలకు వినాయకుడిని భారీ ట్రక్కుపైకి ఎక్కించి మధ్యాహ్నం 12 గంటల వరకు శోభాయాత్రను అలాగే నిమజ్జనం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు గణేష్ ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. దీంతో భక్తులు బుధవారం రాత్రిలోపే బడా గణేష్ ను దర్శించుకోవాలని కోరింది. ఇక హైదరాబాద్ మొత్తం దాదాపు 1.5 లక్షల గణేష్ మండపాలు కొలువుదీరినట్లు సమాచారం. ప్రధాన నిమజ్జనం రోజున దాదాపు 50 లక్షల మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొనే అవకాశం ఉందని భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి అంచనా వేసింది. గణేష్ నిమజ్జనాల కోసం హుస్సేన్ సాగర్ తో పాటు సరూర్ నగర్, కాప్రా, అమీన్ పూర్ తో పాటు నగర వ్యాప్తంగా దాదాపు 150 కు పైగా ప్రాంతాల్లో వీటితో పాటు 110 బేబీ పాండ్స్ ను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిమజ్జనం వేళ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

# స్మార్ట్ సిటీగా నల్గొండ.. అభివృద్ధి పనులపై మంత్రి తీపికబురు!




హైదరాబాద్, సెప్టెంబర్ 22: స్మార్ట్ సిటీగా నల్గొండ మారుతుంది. నల్గొండ రూపురేఖలు మార్చటానికి సీఎం రేవంత్ సహకారంతో ఎంతో కృషి చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడమే కాక కేంద్రం నుంచి మరిన్ని బెస్ట్ కార్పోరేషన్ అవార్డులు కూడా అందుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్ తర్వాత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నల్లగొండ అభివృద్ధికి కృత నిశ్చయంతో ఉన్నామని మంత్రి తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలోనీ క్యాంపు కార్యాలయం వద్ద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పరిశుభ్రతకు సంబంధించి కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు వెట్టింగ్ మెషిన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ నల్లగొండ ను ఆదర్శ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతున్నామన్నారు. నగరంలో 24 గంటలు తాగునీరు అందించేందుకు 83 కోట్ల రూపాయలతో ఇప్పటికే టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. నల్గొండ కార్పొరేషన్లో ఎస్ డి ఎఫ్ నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, అలాగే తక్కిన డివిజన్లలో కూడా రోడ్లతో పాటు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్టిపి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ కు అన్ని రకాల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేసి ఉత్తమ కార్పొరేషన్ అవార్డు కూడా తీసుకుంటామనే నమ్మకం తనకున్నట్టు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ ఇటీవల స్వచ్ఛ అవార్డు అందుకుందని మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ ఇటీవల క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ లో జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఢిల్లీలో అవార్డు కూడా అందుకుందని ఇదే స్ఫూర్తితో ప్రజలకు సేవ చేస్తూ, పట్టణాన్ని చెత్త రహిత నగరంగా తీర్చి దిద్ది మరిన్ని జాతీయ స్థాయి అవార్డులు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండ నగరంలో భారీ వాహనాల వచ్చే శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా పట్టణ పరిధిలో 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, అలాగే డ్రైనేజీ, ఎస్ టి పి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు, ఆధునిక సదుపాయాలతో నల్లగొండ మోడరన్ ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

# మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయాలి



**కలెక్టర్ గరిమ అగ్రవాల్...**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రైతులు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సంప్రదాయ పంటలతో పాటు కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్ద బోనాలలో రైతు కాశెట్టి మల్లయ్య దాదాపు నాలుగు ఎకరాల్లో వరి సాగును వదిలి వంకాయ, మిరప, కాకరకాయ వంటి కూరగాయలను సాగు చేస్తున్నారు. మంగళవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో కూరగాయల తోటను పరిశీలించి రైతు మల్లయ్యను అభినందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంప్రదాయ వరి సాగుకు బదులుగా వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ ఆదాయాన్ని పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వంకాయ దిగుబడి ప్రారంభమైందని, మొక్కలు నాటిన సుమారు 45 రోజుల నుంచి దిగుబడి ప్రారంభమై, దాదాపు ఆరు నెలల వరకు ప్రతి వారం పంట చేతికి వచ్చే అవకాశం ఉందని వివరించారు.

కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. కూరగాయలు, ఆకుకూరల సాగు ద్వారా రైతులకు నిరంతర ఆదాయ అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంతోనే పిల్లల బంగారు భవితకు బాటలు



**కలెక్టర్ గరిమ అగ్రవాల్...**
**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

పిల్లలకు క్రమం తప్పకుండా సరైన పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 9వ పోషణ మాసం సందర్భంగా జిల్లావ్యాప్తంగా 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషణ మాసం ప్రాముఖ్యతను వివరించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నువ్వులు, బాలామృతంతో తయారు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది.

కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళవారం '10 నిమిషాల కార్యక్రమం' నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలు, వసతుల మెరుగుదల, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఆరేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి వారి ఎత్తు, బరువును ప్రతి నెలా నమోదు చేయించాలని సూచించారు. పిల్లల ఎదుగుదలకు అనుగుణంగా అవసరమైన పోషకాహారం అందించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలామృతంతో పాటు ఇతర పోషకాహారాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను క్రమం తప్పకుండా పంపించడం వల్ల పోషకాహారంతో పాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా ప్రాథమిక విద్య అందుతుందని కలెక్టర్ వివరించారు. తీవ్రమైన లేదా మధ్యస్థ పోషకాహార లోపం, తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు.

గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాలల జీవితంలో మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఈ దశలో పిల్లలకు ఇంట్లోనూ సరైన పోషకాహారం అందించాలని సూచించారు. చిన్నారులకు అధికంగా చక్కెర పదార్థాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు గుర్తిస్తే వెంటనే సమీప అంగన్వాడీ కేంద్రం సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వినికిడి, మాట, మానసిక ఎదుగుదల, నడక, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడు సంబంధిత సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది సమాచారం మేరకు ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి పిల్లలను తరలించి అవసరమైన వైద్య సేవలు అందిస్తామని వెల్లడించారు. అక్కడ ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, అవసరమైన వారికి హైదరాబాద్‌లో ఉన్నత వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు తల్లిదండ్రులిద్దరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, సర్పంచ్ మోర లక్ష్మీరాజం, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 8 వేల ఎకరాల కబ్జా ఎక్కడ జరిగిందో చెప్పాలి..

**-2400 ఎకరాల రికవరీ వివరాలు కూడా బయటపెట్టాలి..**
**8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి..**
**-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన సిరిసిల్ల జిల్లాలో 8 వేల ఎకరాల కబ్జా, 2,400 ఎకరాల రికవరీకి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తోట ఆగయ్య మాట్లాడుతూ సిరిసిల్లలో ఎక్కడెక్కడ భూములు కబ్జాకు గురయ్యాయి,ఏ గ్రామంలో ఎంత భూమి ఉంది,ఎవరెవరు కబ్జా చేశారు,ఎంత భూమిని రికవరీ చేశారు.. ప్రస్తుతం ఆ భూముల పరిస్థితి ఏమిటనే వివరాలను గ్రామాల వారీగా, పేర్లతో సహా వెల్లడించాలని, కేవలం అసెంబ్లీ వేదికగా ఆరోపణలు చేయడం కాకుండా వాటికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని అన్నారు.

ఈ అంశంపై ఆర్టీఐ చట్టం ద్వారా అధికారిక సమాచారం సేకరిస్తున్నామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని అన్నారు . ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే వెంటనే బయటపెట్టాలని సవాల్ చేశారు. 8 వేల ఎకరాల కబ్జాపై స్పష్టమైన సమాచారం ఇవ్వలేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వచ్చి 8 వేల ఎకరాల కబ్జాకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తాము చేస్తున్న సవాల్‌ను స్వీకరించి, ఆరోపణలు తప్పని తేలితే అంబేద్కర్ చౌరస్తాలో ప్రజల సమక్షంలో క్షమాపణ చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు రాజకీయ ఆరోపణలు చేస్తోందని అన్నారు.

విప్ ఆది శ్రీనివాస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేదంటే బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తాయని హెచ్చరించారు.

**ఆరోపణలకు ఆధారాలు చూపాలి**

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ.. సిరిసిల్లలో 8 వేల ఎకరాల కబ్జా జరిగిందని ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలో ప్రకటించినందున, దానికి సంబంధించిన ఆధారాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ విషయంపై ఆర్టీఐ ద్వారా అధికారిక సమాచారం కోరుతున్నామని తెలిపారు.ప్రజలను అయోమయానికి గురిచేసేలా ఆరోపణలు చేయడం కాకుండా, కబ్జాకు గురైన భూముల పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కమిషన్ల పరిస్థితిపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని,8 వేల ఎకరాల కబ్జా, 2,400 ఎకరాల రికవరీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, నాలకొండ రాఘవరెడ్డి, కుంబాల మల్లారెడ్డి, బొల్లి రామ్మోహన్, గుండ్లపల్లి పూర్ణచందర్, చంద్రయ్య, రాజు, స్వాతి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పిల్లల మానసిక ఎదుగుదలకు కృషి చేయాలి

**గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి..**
**దొమ్మాటి నర్సయ్య...**
**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

చిన్నారుల శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసానికి కూడా తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతల సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దొమ్మాటి నర్సయ్య పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. పుట్టిన పిల్లలకు బాలామృతంతో పాటు గుడ్లు, అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పేదరికంలో ఉన్న కుటుంబాల్లోని గర్భిణులు, చిన్నారులకు సైతం సరైన పోషకాహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.



చిన్నారులకు చిన్ననాటి నుంచే పౌష్టికాహారంతో పాటు మానసిక వికాసానికి అవసరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నలుగురు గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించగా, ఇద్దరు చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్తయ్య, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సురేష్, ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు దొమ్మాటి రాజు, దివ్యభారతి, ఎస్కే సమాద్, అంగన్వాడీ కార్యకర్తలు అనసూయ, మోతే లక్ష్మి, తాళ్లపల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కేసులు..

**-ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్**
**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:**



సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ, వర్గాల మధ్య గొడవలకు కారణమయ్యేలా వ్యవహరించిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం రాత్రి ఎల్లారెడ్డిపేటలో షట్టర్‌పై రాయి విసిరారని, అక్కడ రాళ్ల కుప్పలు ఉన్నాయని పేర్కొంటూ కొందరు తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో ప్రచారం చేసి వైరల్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపట్టగా, ఒకే వర్గానికి చెందిన మిత్రులు సరదాగా చేసిన చిన్న సంఘటనను కొందరు పెద్దదిగా చిత్రీకరించి ప్రచారం చేసినట్లు వెల్లడైందన్నారు.ఇలాంటి తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో భయాందోళనలు కలిగించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా ఘటన తమ దృష్టికి వచ్చినప్పుడు అది నిజమో, కాదో నిర్ధారించుకోకుండా సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు, వార్తలు ప్రచారం చేయవద్దన్నారు. అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే సీసీ కెమెరాల నిర్వాహకులు ఫుటేజ్‌ను అనధికారికంగా బయట వ్యక్తులకు ఇవ్వకూడదని, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సీసీ ఫుటేజ్‌ను సోషల్ మీడియాలో ప్రచురించరాదని అన్నారు . ప్రజలు ఎలాంటి ఉద్వేగాలకు లోనుకాకుండా సంయమనం పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.



# అవసరమైన రూట్లలో బస్సులు నడపాలి

**సిరిసిల్ల ఆర్టీసీ డీఎంకు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ వినతి**
**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భరత్ కుమార్ను బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న బస్సుల కొరత, ప్రయాణ సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన రూట్లలో తగిన సంఖ్యలో బస్సులను అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థుల ప్రయాణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కంచర్ల రవి గౌడ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రద్దీగా ఉండే సమయాల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మట్టే శ్రీనివాస్, ఆరెల్లి వినయ్ కుమార్, చెట్టిపెల్లి హరీశ్, ఎం.డి. అజ్జు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై హామీ తో దీక్ష విరమించిన అనంతారం యువకుడు అక్కేమ్ నాగరాజు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం అనంతారం బిక్కవాగు పై నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని అనంతారం గ్రామ యువకుడు అక్కేమ్ నాగరాజు గత రెండు రోజులు గా చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష స్థానిక ఎస్ఐ ఉపేంద్ర చారి హామీ తో విరమించుకున్నాడు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. స్థానిక ఎస్.ఐ. మాటను గౌరవించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తో మాట్లాడిన తర్వాత ఎస్ ఐ సాక్షిగా స్పష్టమైన హామీ ఇవ్వడం తో దీక్ష విరామించుకోవడం జరిగిందన్నారు. ఏ కొంచం బ్రిడ్జి పనులు మరోమారు నిర్లక్ష్యం చేసిన చుట్టూ ప్రక్కల నాలుగు గ్రామాల యువత, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చెపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ జోగిందర్ సింగ్, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు



## కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ సభ్యుల శుభాకాంక్షలు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీ) చైర్మన్‌గా కొండూరు రవీందర్ రావు సోమవారం పునఃబాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ సభ్యులు కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో కొండూరు రవీందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా పునఃబాధ్యతలు స్వీకరించిన ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.సహకార రంగంలో కేడీసీసీ బ్యాంక్ మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు, ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు.

అనంతరం కొండూరు రవీందర్ రావు నూతనంగా ఎన్నికైన ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ సభ్యులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బుగ్గ కృష్ణమూర్తి శర్మ, గౌరవ అధ్యక్షులు బండారి బాల్ రెడ్డి, కాసు శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షులు కులేరి కిషోర్ కుమార్, పెంటం శ్రీనివాస్, దుర్గం విజయ్ బాబు, కార్యదర్శి తిరుపతి, ప్రవీణ్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రాచర్ల గొల్లపల్లిలో భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు...

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రాచర్ల రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ దంపతులు హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేసి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్న రాచర్ల రైడర్స్ యూత్ సభ్యులను అభినందించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ఐకమత్యాన్ని పెంపొందించేలా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## కుర్చీపైనే సెలైన్.. ఎల్లారెడ్డిపేట ఆస్పత్రిలో అరకొర వసతులు

**-బెడ్‌లు, సెలైన్ స్టాండ్లు లేక రోగుల అవస్థలు..**

**-మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజల డిమాండ్**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:**

మండల ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత రోగులను ఇబ్బందులకు గురిచేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో చికిత్స సమయంలో అవస్థలు పడాల్సి వస్తోందని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల ఓ రోగికి సెలైన్ ఎక్కించాల్సి ఉండగా బెడ్ అందుబాటులో లేకపోవడంతో కుర్చీపైనే సెలైన్ బాటిల్‌ను ఉంచి చికిత్స అందించిన దృశ్యం ఆస్పత్రిలోని వసతుల పరిస్థితిని తెలియజేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. రోగులకు అత్యవసరంగా అవసరమయ్యే సెలైన్ స్టాండ్లు కూడా అందుబాటులో లేకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు ఈ ప్రభుత్వ ఆస్పత్రినే ఆశ్రయిస్తున్నారు. సాధారణ అనారోగ్యంతో పాటు అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రజలకు అందుబాటులో ఉండే ఈ ఆస్పత్రిలో కనీస వసతులు లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ...

**రూ.20 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో లింక్ రోడ్డు నిర్మాణం ప్రారంభం...**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్థానిక రెండో బైపాస్ రోడ్డు నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పక్కన ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం వరకు ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా లింక్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.20 లక్షలతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు చైర్‌పర్సన్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు లింగంపల్లి భాగ్యలక్ష్మి–సత్యనారాయణ, దొంతినేని కళ్యాణి–అశోక్ రావు, నెల్లుట్ల నరేష్, అడిచర్ల సాయి కృష్ణ, మున్సిపల్ డీఈ వాణి, ఏఈ నరసింహస్వామి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు

**-అడ్మిన్లతో సహా బాధ్యులపై కేసులు.. అవసరమైతే హిస్టరీ షీట్లు..**

**- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



సోషల్ మీడియా వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టడం, అసత్య ప్రచారాలను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ

ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, ఇతరుల మనోభావాలను కించపరిచేలా అసత్య ప్రచారాలు చేయడం, అభ్యంతరకర పోస్టులు పెట్టడం, వాటిని ఫార్వర్డ్ చేయడం వంటివి చేయవద్దని సూచించారు.

సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు చేసినా, అలాంటి పోస్టులను ఫార్వర్డ్ చేసినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత సామాజిక మాధ్యమాల నిర్వాహకులు, సమూహాల నిర్వాహకులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అవసరమైతే నిబంధనల ప్రకారం హిస్టరీ షీట్లు తెరవడం వంటి చర్యలు కూడా చేపడతామని తెలిపారు.ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని పరిశీలించకుండా నమ్మి, ఇతరులకు పంపవద్దని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు.



## 24 అడుగుల గణనాథుడికి ఘనంగా పూజలు

**-రాజన్న యూత్ ఆధ్వర్యంలో 34వ వార్షికోత్సవ వేడుకలు..**

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ ఈవో, కరీంనగర్ ఏసీపీ**

**బలగం టీవీ,వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని శ్రీ బద్ది పోచమ్మ వీధిలో రాజన్న యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 24 అడుగుల సిద్ధి బుద్ధి వినాయకుడికి మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు.

రాజన్న యూత్ 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భారీ వినాయకుడిని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి కుటుంబ సమేతంగా గణనాథుడిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన అతిథులను రాజన్న యూత్ సభ్యులు శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. 24 అడుగుల భారీ గణనాథుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుండగా, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఈ కార్యక్రమంలో రాజన్న యూత్ ప్రతినిధులు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరిసిల్లకు సీఎం వస్తుండు.. లెక్కలు తేలుతాయి..

**-సెప్టెంబర్ 30 నుంచి కేటీఆర్‌కు కౌంట్‌డౌన్ మొదలు**

**-నేతన్నలకు ఏం చేశారు... ప్రాజెక్టులను ఎందుకు నిర్లక్ష్యం చేశారు..?**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన ప్రకటనతో మాజీ మంత్రి కేటీఆర్ వెన్నులో వణుకు మొదలైందని, సెప్టెంబర్ 30 నుంచి సిరిసిల్లలో కేటీఆర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం ల తో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిలు గా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో సిరిసిల్లలో రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయని పేర్కొన్నారు.

సిరిసిల్లలో సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుల్లో గుబులు మొదలైందన్నారు. నేతన్నలకు గత ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఉత్పత్తి ఆర్డర్లు కల్పించి చేతినిండా పని కల్పించడంతో పాటు సుమారు రూ.350 కోట్ల బకాయిల చెల్లింపులకు చర్యలు చేపట్టిందన్నారు. నేతన్నలకు అండగా నిలిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వస్తున్నారని, రూ.49 కోట్ల విద్యుత్ బకాయిలను కూడా చెల్లించనున్నట్లు తెలిపారు.

తొమ్మిదో ప్యాకేజీ, ఎగువ మానేరు, కాలువల నిర్మాణం, సూరమ్మ చెరువు ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, భూసేకరణ చేపట్టి పనులను వేగవంతం చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు.ధరణి పోర్టల్, జీవో 22ఏను అడ్డుపెట్టుకుని కేటీఆర్ అనుచరులు సిరిసిల్లలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల వ్యవహారాలపై 'ఫామ్‌హౌస్ ఫైల్స్' పేరుతో సినిమా తీయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

గతంలో రాజన్న దర్శనానికి వచ్చిన కేసీఆర్ ఆలయ అభివృద్ధికి ఏటా రూ.200 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ అమలు కాలేదని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రూ.250 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

**లక్ష మందితో సభను విజయవంతం చేయాలి**

సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను లక్ష మందితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలను సభ ద్వారా వెల్లడిస్తామని తెలిపారు.

అనంతరం జిల్లా కేంద్రంలోని రంగినేని ట్రస్ట్ వద్ద ఏర్పాటు చేయనున్న సీఎం బహిరంగ సభ స్థలాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి ఆది శ్రీనివాస్ పరిశీలించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, సీనియర్ నాయకులు చక్రధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ, ప్యాక్స్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా ఇందిరా మహిళా శక్తి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న జిల్లా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా భవనం వెలుపల, లోపల కొనసాగుతున్న వివిధ పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యాలయాలు, డార్మిటరీ, కిచెన్, మీటింగ్ హాల్ తదితర నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భవన నిర్మాణ పనులతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కూడా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భవనం ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లను నాణ్యతతో, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.




## జీతాలు వెంటనే చెల్లించాలి.. పని భారం తగ్గించాలి...



**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల సివిల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం హాస్పిటల్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని, పని భారం తగ్గించాలని, హాస్పిటల్‌లోని పడకలకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముషం రమేష్ మాట్లాడుతూ.. కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ప్రతి నెల చివరి వరకు కూడా వేతనాలు అందడం లేదని అన్నారు. ఈ నెల 22వ తేదీ వచ్చినా కార్మికులకు జీతాలు అందకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సిరిసిల్ల సివిల్ హాస్పిటల్‌లో సుమారు 300 పడకలకు అనుగుణంగా సరిపడా సిబ్బంది లేకపోవడంతో సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న కార్మికులపై పని భారం పెరుగుతోందని రమేష్ అన్నారు. అధిక పనిభారం కారణంగా కార్మికులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి శుక్రవారం లోపు కార్మికులకు వేతనాలు చెల్లించాలని, 300 పడకలకు సరిపడా సానిటేషన్ సిబ్బందిని నియమించాలని, కార్మికులపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే శుక్రవారం నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పద్మ, కే. జయ, మమత, సునంద, దేవయ్య, బాలరాజు, స్రవంతి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో చల్మెడ ప్రత్యేక పూజలు

**-పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి**

**బలగం టీవీ,వేములవాడ:**

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో చల్మెడ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వినాయకుడిని వేడుకున్నారు.రుద్రంగి మండల కేంద్రంలో నాయకులతో కలిసి పలు వినాయక మండపాలను సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు





చేశారు. శ్రీనగర్ పటేల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం నిర్వాహకులు చల్మెడను శాలువాతో సత్కరించారు.మహాలక్ష్మి వీధిలో ఛత్రపతి శివాజీ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలోనూ చల్మెడ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని పేర్కొంటూ భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కోనరావుపేట మండల కేంద్రంలో ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని చల్మెడ లక్ష్మీనరసింహారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని చల్మెడ పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.



## పిడుగుపాటుకు రైతు మృతి

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు రైతు జంగా సుధాకర్‌రెడ్డి (65) మృతి చెందాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుండగా పొలంలో ఉన్న సుధాకర్‌రెడ్డి మామిడి చెట్టు కిందకు వెళ్లిన సమయంలో పిడుగు పడినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

పిడుగుపాటుతో సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెంది పొలంలో పడి ఉన్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పొలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రైతు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

## వేములవాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో చోరీ

**బలగం టీవీ,వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి కార్యాలయం వెనుక భాగం నుంచి లోపలికి చొరబడి ఒక సీలింగ్ ఫ్యాన్‌తో పాటు ఇంటర్నెట్ వైర్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లాడు.

మంగళవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బందికి వెనుక తలుపు తెరిచి ఉండటంతోపాటు ఫ్యాన్ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. అనంతరం విషయాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌కు తెలియజేశారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## వినాయకుడి నోట్ల దండ చోరీకి యత్నం

**బలగం టీవీ,వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో వినాయకుడి వద్ద అలంకరించిన భారీ నోట్ల దండను అపహరించేందుకు ఓ వ్యక్తి చేసిన ప్రయత్నాన్ని యువకులు అడ్డుకున్నారు. బద్దిపోచమ్మ వీధిలోని వినాయకుడి విగ్రహం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.

జీవైసీ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడికి రూ.500 నోట్లతో రూ.50 వేల విలువైన దండను అలంకరించారు. తెల్లవారుజామున అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి నోట్ల దండను గమనించి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన యూత్ సభ్యులు వెంటనే అప్రమత్తమై అతడిని వెంబడించారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నోట్ల దండను కూడా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకుని ఘటనపై విచారణ చేపట్టారు.

# పతకాల పట్టికలో చైనా అగ్రస్థానం..

**8వ స్థానంలో భారత్**

**1 స్వర్ణం, 4 రజతాలు, 2 కాస్యాలతో భారత్ ఖాతాలో మొత్తం 7 పతకాలు**

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న 20వ ఆసియా క్రీడల మూడో అధికారిక రోజు (సెప్టెంబరు 22, సోమవారం) పోటీలు ముగిసేసరికి చైనా జట్టు తన స్పష్టమైన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. చైనా అత్యధికంగా 32 స్వర్ణాలు, 13 రజతాలు, 8 కాస్య పతకాలతో కలిపి మొత్తం 53 పతకాలతో పతకాల పట్టికలో మొదటి స్థానంలో కొనసాగుతోంది.

ఆతిథ్య జపాన్ 11 స్వర్ణాలు, 16 రజతాలు, 19 కాస్యాలతో మొత్తం 46 పతకాలు సాధించి రెండో స్థానంలో నిలవగా, దక్షిణ కొరియా 6 స్వర్ణాలు, 4 రజతాలు, 17 కాస్య పతకాలతో (మొత్తం 27) మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో కజకిస్థాన్ (6 స్వర్ణాలు, మొత్తం 12), థాయిలాండ్ (4 స్వర్ణాలు, మొత్తం 6), హాంగ్‌కాంగ్ (3 స్వర్ణాలు, మొత్తం 12), తజికిస్థాన్ (2 స్వర్ణాలు, మొత్తం 4) వరుసగా నాలుగు నుంచి ఏడో స్థానాల్లో నిలిచాయి.

భారతదేశం మహిళల క్రికెట్ ఫైనల్లో శ్రీలంకపై ఘనవిజయం సాధించి తొలి స్వర్ణ పతకాన్ని సాధించడంతో పాటు మొత్తం 7 పతకాలతో (1 స్వర్ణం, 4 రజతాలు, 2 కాస్యాలు) పట్టికలో ఎనిమిదో స్థానానికి చేరింది.

భారత్ వెనుకాల ఉజ్బెకిస్థాన్ (1 స్వర్ణం, 4 రజతాలు, 1 కాస్యం) తొమ్మిదో స్థానంలో, చైనీస్ తైపీ (1 స్వర్ణం, 3 రజతాలు, 5 కాస్యాలు) పదో స్థానంలో నిలిచాయి. అలాగే ఇరాన్, సింగపూర్ చెరో 5 పతకాలతో 11వ స్థానాన్ని పంచుకోగా, మకావు (4 పతకాలు) 13వ స్థానంలో, జోర్డాన్, మైన్మార్ చెరో 3 పతకాలతో 14వ స్థానంలో ఉన్నాయి.

మలేషియా, వియత్నాం చెరో 4 పతకాలతో (1 స్వర్ణం, 3 కాస్యాలు) 16వ స్థానంలో, కువైట్ 3 పతకాలతో 18వ స్థానంలో నిలవగా, బహ్రెయిన్ 2 రజతాలతో 19వ స్థానంలో నిలిచింది. ఇండోనేషియా (8 పతకాలు), ఫిలిప్పీన్స్ (4 పతకాలు), ఇరాక్ (3 పతకాలు), లెబనాన్, ఖతార్ (చెరో 2 పతకాలు) ఆ తర్వాతి స్థానాల్లో ఉండగా; ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంక, తుర్క్మెనిస్తాన్ ఒక్కో రజతంతో 25వ స్థానంలో కొనసాగుతున్నాయి.

పట్టిక చివరలో కాంబోడియా 4 కాస్యాలతో 28వ స్థానంలో, కిర్గిజిస్థాన్ 3 కాస్యాలతో 29వ స్థానంలో, సౌదీ అరేబియా, పాకిస్థాన్ చెరో 2 కాస్యాలతో 30వ స్థానంలో నిలవగా; బ్రూనై, మంగోలియా, సిరియా చెరో 1 కాస్య పతకంతో 32వ స్థానంలో నిలిచాయి.

# ఆసియాడ్‌లో నేడు భారత్‌కు భారీ షెడ్యూల్..

**బరిలోకి మీరాబాయి చాను, హాకీ, కబడ్డీ జట్లు!**

**బ్యాడ్మింటన్‌లో చైనాతో సెమీఫైనల్ పోరు; షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లలో పతకాలపై ఆశలు**

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల్లో బుధవారం (సెప్టెంబరు 23) భారత క్రీడాకారులు పలు కీలక పోటీల్లో తలపడనున్నారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను, బ్యాడ్మింటన్ పురుషుల జట్టు, హాకీ, కబడ్డీ టీమ్‌లతో పాటు షూటింగ్ విభాగంలో మను భాకర్ వంటి ప్రముఖ అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. భారత కాలమానం ప్రకారం పూర్తి షెడ్యూల్ వివరాలు:

బ్యాడ్మింటన్: ఉదయం 11:30 గంటలకు పురుషుల టీమ్ సెమీఫైనల్‌లో చైనాతో భారత్ తలపడనుంది.

వెయిట్‌లిఫ్టింగ్: ఉదయం 10:00 గంటలకు మహిళల 49 కేజీల ఫైనల్ గ్రూప్-ఎ రేసులో మీరాబాయి చాను దిగుతుండగా, మధ్యాహ్నం 1:30 గంటలకు మహిళల 53 కేజీల ఫైనల్ గ్రూప్-ఎలో జ్ఞానేశ్వరి యాదవ్ పోటీపడనున్నారు.

కబడ్డీ & హాకీ: ఉదయం 8:30 గంటలకు మహిళల కబడ్డీ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఇరాన్‌తో, ఉదయం 9:45 గంటలకు పురుషుల కబడ్డీ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ ఆడనుంది. ఇక ఉదయం 11:30 గంటలకు మహిళల హాకీ పూల్-బి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో భారత జట్టు తలపడనుంది.

షూటింగ్: ఉదయం 6:15 గంటలకు మహిళల ఎయిర్ పిస్టల్ (ఇండివిజువల్ & టీమ్) క్వాలిఫికేషన్ రౌండ్‌లో సురుచి సింగ్, ఈషా సింగ్, మను భాకర్ బరిలోకి దిగనున్నారు. ఉదయం 9:00 గంటలకు ఈ విభాగం ఫైనల్స్ జరగనున్నాయి. అలాగే ఉదయం 6:30 గంటల నుంచి స్కీట్ పురుషుల, మహిళల విభాగాల క్వాలిఫికేషన్స్, మధ్యాహ్నం ఫైనల్స్ జరగనున్నాయి.

బాక్సింగ్ & వూషు: ఉదయం 8:30 గంటల నుంచి పురుషుల 80 కేజీల రౌండ్ ఆఫ్ 16 పోరులో అంకుష్, హంసా వోగెల్‌తో తలపడనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు వూషు మహిళల సాండా 60 కేజీల సెమీఫైనల్లో రోషిబినా దేవి నవోరెమ్ పోటీపడనున్నారు.

టేబుల్ టెన్నిస్, స్క్వాష్ & స్విమ్మింగ్: ఉదయం 6:30 గంటల నుంచి టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లు (హర్మీత్ దేశాయ్-యశస్విని ఘోర్పడే, మానుష్ షా-దియా చితాలే) ప్రారంభమవుతాయి. స్క్వాష్ విభాగంలో ఉదయం 10:30 గంటల నుంచి అభయ్ సింగ్, తన్వి ఖన్నా, వీర్ చోత్రానీ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లలో తలపడతారు. స్విమ్మింగ్‌లో రోహిత్ బెనెడిక్షన్, సాజన్ ప్రకాష్ (100 మీ. బటర్ ఫ్లై), అనీష్ సునీల్ కుమార్, వేదాంత్ మాధవన్ (200 మీ. ఫ్రీస్టైల్) ఉదయం 6:42 గంటల నుంచి హీట్స్ ఆడనున్నారు.

ఈ ప్రధాన క్రీడలతో పాటు ఈ-స్పోర్ట్స్, ఈక్వెస్ట్రియన్, ఫెన్సింగ్, రోయింగ్, కెనోయ్ స్ప్రింట్, సాఫ్ట్ టెన్నిస్, సెపక్ తక్రా విభాగాలలో కూడా భారత అథ్లెట్లు తెల్లవారుజామున 5:30 గంటల నుంచే వివిధ క్వాలిఫైయింగ్, హీట్స్ మ్యాచ్‌లలో పోటీపడనున్నారు.





# శ్రీలంకపై 147 పరుగుల భారీ విజయం..

**రికార్డు స్థాయిలో 216 పరుగులు చేసిన టీమిండియా;**

**విజయంలో కీలక పాత్ర పోషించిన స్మృతి మంధాన, రిచా ఘోష్**

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లోని నిషిన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడలు 2026 మహిళల టీ20 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుంది. శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 147 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, ఆసియాడ్‌లో వరుసగా రెండోసారి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల రికార్డు స్థాయి భారీ స్కోరు సాధించింది. ఆసియా క్రీడల మహిళల క్రికెట్ చరిత్రలోనే ఇది అత్యధిక జట్టు స్కోరుగా నిలిచింది. ఓపెనర్లు స్మృతి మంధాన (45 బంతుల్లో 79; 5 ఫోర్లు, 7 సిక్సర్లు), షఫాలీ వర్మ (29 బంతుల్లో 48) తొలి వికెట్‌కు 99 పరుగుల మెరుపు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో స్మృతి మంధాన మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగులు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది. చివరి ఓవర్లలో రిచా ఘోష్ (22 బంతుల్లో 49 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత్ స్కోరును 200 దాటించింది. శ్రీలంక బౌలర్లలో సుగంధికా కుమారి, కవిషా దిల్హారి, చాముది ప్రభోద చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు భారత బౌలర్ల ధాటికి తాళలేక 15.4 ఓవర్లలో కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక బ్యాటర్లలో కెప్టెన్ చమరి ఆటపట్టు (29) ఒక్కతే కాస్త పోరాడగా, మిగతా వారంతా వరుసగా పెవిలియన్ బాట పట్టారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ (3/6) మూడు వికెట్లతో చెలరేగగా, షఫాలీ వర్మ (2/3), శ్రేయాంక పాటిల్ (2/9), నల్లపురెడ్డి చరణి (2/13) రెండేసి వికెట్లు తీసి శ్రీలంకను దెబ్బతీశారు. ఈ అద్భుత విజయంతో 2026 ఆసియా క్రీడలలో భారతదేశానికి తొలి స్వర్ణ పతకం దక్కింది.

# పోడియంపై ఆనందభాష్పాలు..

**నెట్టింట వైరల్‌గా మారిన హర్మన్‌ప్రీత్ కౌర్ వీడియో!**

**శ్రీలంకను 147 పరుగులతో చిత్తు చేసి హ్యాట్రిక్ విజయాలతో స్వర్ణం గెలుచుకున్న భారత మహిళల జట్టు**

బలగం టీవీ, హైదరాబాద్



ఆసియా క్రీడలు 2026 మహిళల క్రికెట్‌లో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన టీమిండియా టోర్నీలో హ్యాట్రిక్ విజయాలతో విజేతగా నిలిచి, వరుసగా రెండోసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. మంగళవారం నిషిన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 147 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది.

ఈ చారిత్రాత్మక విజయంతో ఆసియా గేమ్స్ 2026లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం దక్కింది. పతక ప్రదానోత్సవం సందర్భంగా పోడియంపై మువ్వన్నెల జెండా ఎగురుతుండగా జాతీయ గీతాలాపన జరుగుతున్న వేళ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తీవ్ర భావోద్వేగానికి గురైంది. ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకోలేక ఆనందభాష్పాలు రాల్చిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 216 పరుగుల రికార్డు స్థాయి భారీ స్కోర్ సాధించింది. ఓపెనర్ స్మృతి మంధాన (45 బంతుల్లో 79; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు), షెఫాలీ వర్మ (29 బంతుల్లో 48) తొలి వికెట్‌కు 99 పరుగులు జోడించగా, చివరిలో రిచా ఘోష్ (22 బంతుల్లో 49 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మెరిసింది. అనంతరం 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టును భారత బౌలర్లు 15.4 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూల్చారు. చమరి ఆటపట్టు (29) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ (3/6) మూడు వికెట్లు తీయగా, షెఫాలీ వర్మ, శ్రేయాంక పాటిల్, శ్రీచరణి తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఫైనల్లో ఓడిన శ్రీలంకకు రజతం దక్కగా, బంగ్లాదేశ్‌పై గెలిచిన పాకిస్థాన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

# భారత్‌కు తొలి స్వర్ణం..



**శ్రీలంకను చిత్తు చేసిన మహిళల క్రికెట్ జట్టు!**

**హాకీలో లంకపై 16-1తో భారత పురుషుల రికార్డు విజయం;**

**బ్యాడ్మింటన్, వుషుల్లో పతకాలు ఖాయం**

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో మూడో రోజు భారత్ పతకాల బోణీ కొట్టింది. ఐచి-నాగోయా వేదికగా జరిగిన మహిళల టీ20 క్రికెట్ ఫైనల్‌లో భారత మహిళల జట్టు 147 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను చిత్తు చేసి దేశానికి తొలి స్వర్ణ పతకాన్ని అందించింది. ఈ విజయంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య ఏడుకు చేరింది.

మరోవైపు, పురుషుల హాకీ పూల్-ఎ విభాగంలో భారత జట్టు శ్రీలంకపై 16-1 గోల్స్ తేడాతో విరుచుకుపడి ఘనవిజయాన్ని నమోదు చేసింది. వుషు మహిళల 60 కేజీల విభాగంలో రోషిబినా దేవి సెమీఫైనల్ చేరి భారత్‌కు పతకాన్ని ఖాయం చేయగా, పురుషుల బ్యాడ్మింటన్ జట్టు క్వార్టర్ ఫైనల్లో ఆతిథ్య జపాన్‌ను 3-0 తేడాతో ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లడంతో పాటు పతకాన్ని ఖాయం చేసుకుంది. మహిళల బ్యాడ్మింటన్ జట్టు మాత్రం జపాన్ చేతిలో 1-3 తేడాతో ఓడి క్వార్టర్స్ నుంచే నిష్క్రమించింది.

ఆసియాడ్ మూడో రోజు ప్రధాన విశేషాలు:

కబడ్డీ: పురుషుల గ్రూప్-ఎ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ 63-31 తేడాతో దక్షిణ కొరియాపై తిరుగులేని విజయం సాధించింది.

బాక్సింగ్: పురుషుల 55 కేజీల విభాగంలో జాదుమణి సింగ్ 5-0తో నేపాల్ క్రీడాకారుడు చంద్రబహదూర్ థాపాపై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు.

టేబుల్ టెన్నిస్: మహిళల టీమ్ రౌండ్ ఆఫ్ 16లో థాయిలాండ్‌పై 3-2తో గెలిచిన భారత్, క్వార్టర్ ఫైనల్లో ఉత్తర కొరియా చేతిలో ఓటమి పాలైంది.

జిమ్నాస్టిక్స్: ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ మహిళల వాల్ట్ విభాగంలో భారత స్టార్ ప్రణతి నాయక్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

షూటింగ్: 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ అర్హత రౌండ్‌లో ఇలవేనిల్ వలరివన్, పార్థ్ మనే రెండో స్థానంలో నిలిచినా, ఫైనల్లో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు.

సాఫ్ట్ టెన్నిస్ & ఇ-స్పోర్ట్స్: పురుషుల సింగిల్స్‌లో జై మీనా (4-0) పాకిస్తాన్‌పై గెలవగా, ఇ-స్పోర్ట్స్ ఈఫుట్‌బాల్‌లో భారత్ ఉజ్బెకిస్థాన్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

# జపాన్‌పై భారత్ విజయం..

**200వ టీ20I విజయంతో ప్రపంచ రికార్డు!**

**5 ఓవర్ల మ్యాచ్‌లో 2 పరుగుల తేడాతో గెలుపొందిన శ్రేయస్ సేన; చివరి ఓవర్లో అక్షర్ పటేల్ అద్భుత బౌలింగ్**

బలగం టీవీ, హైదరాబాద్



జపాన్‌లోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, జపాన్ జట్ల మధ్య జరిగిన తొలి చారిత్రాత్మక టీ20 మ్యాచ్ తీవ్ర ఉత్కంఠ నడుమ ముగిసింది. వర్షం కారణంగా ఐదు ఓవర్లకు కుదించిన ఈ పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు కేవలం 2 పరుగుల తేడాతో జపాన్‌పై విజయాన్ని అందుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు జపాన్ బౌలర్లు ఊహించని షాక్ ఇచ్చారు. ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగులేమీ చేయకుండానే తొలి ఓవర్లోనే పెవిలియన్ బాట పట్టగా, సంజు శాంసన్ (9), ఇషాన్ కిషన్ (3) కూడా త్వరగానే నిష్క్రమించారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 12 బంతుల్లో 16 పరుగులు చేయడంతో భారత్ నిర్ణీత 5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసింది.

అనంతరం 33 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. జపాన్ బ్యాటర్లు ధీటుగా పోరాడి నిర్ణీత 5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 30 పరుగుల వద్దే నిలిచిపోయారు. చివరి ఓవర్లో జపాన్ గెలుపునకు 8 పరుగులు అవసరం కాగా, ఒత్తిడిని జయించిన అక్షర్ పటేల్ కేవలం 5 పరుగులు మాత్రమే ఇచ్చి భారత్‌ను విజేతగా నిలిపాడు.

ఈ విజయంతో భారత పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో అంతర్జాతీయ మ్యాచ్‌లలో 200వ విజయాన్ని నమోదు చేసి తొలి జట్టుగా సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై తొలి విజయాన్ని అందుకున్న భారత్, సుదీర్ఘ ప్రయాణంలో ఈ చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు మార్క్ వుడ్ వీడ్కోలు



బలగం టీవీ, హైదరాబాద్

ఇంగ్లండ్ స్టార్ పేసర్ మార్క్ వుడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గాయాలతో సతమతమవుతూనే కెరీర్‌ను కొనసాగించిన 36 ఏళ్ల వుడ్.. వచ్చే ఏడాది యాషెస్, వన్డే ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు ముందే రిటైర్మెంట్ ప్రకటించాడు. ''ఈసారి నేను యుద్ధంలో ఓడిపోయా'' అంటూ తన వీడ్కోలు సందేశాన్ని వెల్లడించాడు.

11 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో వుడ్ ఇంగ్లండ్ పేస్ దళంలో కీలక సభ్యుడిగా నిలిచాడు. గాయాల నుంచి కోలుకున్న ప్రతిసారీ బలంగా తిరిగొచ్చిన అతడు.. ఈసారి వైద్యుల సూచనల మేరకు టెస్టులు, వన్డేలు ఆడటం సాధ్యం కాదని పేర్కొన్నాడు. ఇంగ్లండ్ తరఫున ఆడాలన్న తన కల నెరవేరిందని, దేశం తరఫున ఆడిన ప్రతిసారీ తనలోని పిల్లాడు ఎంతో సంబరపడేవాడని వుడ్ తెలిపాడు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించడం, గొప్ప వ్యక్తులను కలవడం, అత్యుత్తమ జట్లతో ఆడటం తన అదృష్టమని పేర్కొన్నాడు.

2015లో లార్డ్స్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వుడ్.. ఆ తర్వాత ఇంగ్లండ్‌కు నమ్మదగిన పేసర్‌గా ఎదిగాడు. 38 టెస్టుల్లో 119 వికెట్లు, 70 వన్డేల్లో 80 వికెట్లు, 38 టీ20ల్లో 54 వికెట్లు పడగొట్టాడు. గత ఏడాది నవంబర్‌లో అతడు చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

2019 వన్డే ప్రపంచకప్‌లో 18 వికెట్లు తీసి ఇంగ్లండ్ తొలిసారి ప్రపంచకప్ విజేతగా నిలవడంలో వుడ్ కీలక పాత్ర పోషించాడు. అనంతరం 2022లో ఆస్ట్రేలియా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లోనూ ఇంగ్లండ్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. రెండు ప్రపంచకప్‌లతో పాటు యాషెస్ విజేతగా నిలిచిన వుడ్.. 11 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు.

# జుగ్‌రాజ్, అభిషేక్, దిల్‌ప్రీత్‌ల హ్యాట్రిక్స్..

**శ్రీలంకపై భారత పురుషుల హాకీ జట్టు విజయం**

**ఏకపక్ష పోరులో 16-1 తేడాతో విజయం; నలుగురు గోల్స్ తో చెలరేగిన జుగ్‌రాజ్ సింగ్**

బలగం టీవీ, హైదరాబాద్



ఆసియా క్రీడలు 2026 పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ మరో ఘనవిజయాన్ని నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన గ్రూప్-ఎ రెండో మ్యాచ్‌లో శ్రేష్ఠమైన ప్రదర్శన కనబరిచిన హర్మన్‌ప్రీత్ సేన 16-1 తేడాతో బలహీనమైన శ్రీలంకను చిత్తు చేసింది. భారత ఆటగాళ్లలో డ్రాగ్ ఫ్లికర్ జుగ్‌రాజ్ సింగ్ 4 గోల్స్‌తో విజృంభించగా, స్ట్రైకర్లు అభిషేక్, దిల్‌ప్రీత్ సింగ్ చెరో హ్యాట్రిక్ (3 గోల్స్) సాధించారు.

తొలి మ్యాచ్‌లో ఇండోనేషియాను 13-1తో ఓడించిన భారత్, ఈ మ్యాచ్‌లోనూ ప్రారంభం నుంచే పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 5వ నిమిషంలో మందీప్ సింగ్ తొలి గోల్ చేసి ఖాతా తెరవగా, జుగ్‌రాజ్ (10వ, 22వ, 42వ, 53వ నిమిషాల్లో) 4 గోల్స్ తో చెలరేగాడు. అభిషేక్ (11వ, 17వ, 49వ), దిల్‌ప్రీత్ సింగ్ (30వ, 38వ, 55వ) హ్యాట్రిక్ గోల్స్ సాధించగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (16వ, 45వ) రెండు గోల్స్ చేశాడు. సుఖ్‌జీత్ సింగ్ (29వ), మన్‌ప్రీత్ సింగ్ (31వ), వివేక్ సాగర్ ప్రసాద్ (36వ) తలో గోల్ అందించారు.

మరోవైపు శ్రీలంక తరఫున 50వ నిమిషంలో సురేష్ రత్నాయకే ఏకైక గోల్ సాధించాడు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే భారత్‌పై శ్రీలంక సాధించిన తొలి గోల్ ఇదే కావడం గమనార్హం. పూల్ రౌండ్లో వరుసగా రెండో విజయం సాధించిన భారత్, తమ తదుపరి మ్యాచ్‌లో గురువారం దక్షిణ కొరియాతో తలపడనుంది.


# ఉత్తర కొరియా చేతిలో భారత్‌కు భంగపాటు..

**క్వార్టర్స్‌లోనే వైదొలిగిన మహిళల జట్టు!**

**ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించిన భారత పురుషుల టీమ్; ఆసియాడ్‌లో క్వార్టర్స్‌కు చేరినా పతకం సాధించలేకపోయిన భారత్**

బలగం టీవీ, హైదరాబాద్





ఆసియా క్రీడలు 2026 టేబుల్ టెన్నిస్ విభాగంలో భారత పురుషులు, మహిళల జట్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. మంగళవారం జరిగిన మహిళల టీమ్ క్వార్టర్ ఫైనల్లో భారత్ 0-3 తేడాతో ఉత్తర కొరియా (DPRK) చేతిలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు భారత పురుషుల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లోనే (రౌండ్ ఆఫ్ 16) పరాజయాన్ని మూటగట్టుకుని ఇంటిబాట పట్టింది.

టోయోటాలోని స్కై హాల్ వేదికగా జరిగిన ప్రీక్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌పై 3-2తో తీవ్రంగా శ్రమించి విజయం సాధించిన భారత మహిళల జట్టు, క్వార్టర్ ఫైనల్లో మాత్రం ఉత్తర కొరియా ధాటికి నిలవలేకపోయింది. తొలి మ్యాచ్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి శ్రీజ ఆకుల 0-3 (7-11, 6-11, 5-11) తేడాతో కిమ్ కుమ్ యోంగ్ చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో యశస్విని ఘోర్పడే 0-3 (4-11, 3-11, 6-11) తో ప్యాన్ సాంగ్ గ్యాంగ్ చేతిలో, మూడో మ్యాచ్‌లో దియా చితలే 0-3 (9-11, 7-11, 8-11) తేడాతో చా సు యోంగ్ చేతిలో పరాజయం పాలయ్యారు.

అంతకుముందు థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో యశస్విని రెండు విజయాలతో మెరవగా, శ్రీజ నిర్ణయాత్మక ఐదో మ్యాచ్‌లో గెలిచి భారత్‌ను క్వార్టర్స్‌కు చేర్చినప్పటికీ, ఆ ఊపును ఉత్తర కొరియాపై కొనసాగించలేకపోయారు.

ఇక పురుషుల విభాగంలో దక్షిణ కొరియా చేతిలో భారత్ భంగపాటుకు గురైంది. హర్మీత్ దేశాయ్ తొలి మ్యాచ్‌లో జంగ్ వూ-జిన్ చేతిలో 1-3 (11-8, 7-11, 8-11, 9-11) తో ఓడగా, మనుష్ షా తీవ్రంగా పోరాడి ఓ జంగ్సంగ్ చేతిలో 2-3 (4-11, 11-8, 13-11, 11-13, 6-11) తో ఓటమి పాలయ్యాడు. చివరి మ్యాచ్‌లో మానవ్ ఠక్కర్ 1-3 (10-12, 6-11, 11-7, 10-12) తేడాతో అన్ జై-యున్ చేతిలో పరాజయం చెందడంతో భారత పురుషుల ప్రయాణం ముగిసింది.

## కొడుకు పేరును అధికారికంగా ప్రకటించిన నారా రోహిత్



టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ ఇటీవల తండ్రి అయిన విషయం తెలిసిందే. ఆయన సతీమణి శిరీష ఇటీవల పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. అయితే ఇప్పటివరకూ చిన్నారికి సంబంధించిన ఫొటోలు, పేరు తదితర వివరాలను వెల్లడించలేదు. ఈ మేరకు తాజాగా తమ కుమారుడి పేరును ప్రకటించారు నారా రోహిత్ దంపతులు. ఇందుకు సంబంధించిన నామకరణం ఫంక్షన్ అట్టహాసంగా జరిగింది. ఆ వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. నారా రోహిత్ దంపతులు తమ కుమారుడికి నందన్ రామ నారా అనే పేరును పెట్టినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు తన ఇన్ స్టా ఖాతాలో "ప్రేమ.. కృతజ్ఞత.. ఆనందంతో నిండిన హృదయాలతో మా అబ్బాయిని ఈ ప్రపంచానికి పరిచయం చేస్తున్నాము.. మా చిన్నారి నందన్ రామ నారాకు స్వాగతం. నువ్వే మాకు గొప్ప ఆశీర్వాదం" అని రోహిత్ పోస్టు పెట్టారు.

## ఫహద్ ఫాజిల్ కొత్త సినిమా ట్రైలర్



ఫహద్ ఫాజిల్ అనగానే మనకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్- సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప మూవీనే గుర్తుకొస్తుంది. కానీ ఆయన మలయాళంలో చాలా సినిమాలే చేశారు. 2002 నుంచే ఫహద్ సినిమాలు చేస్తున్నారు. అయితే ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో తెలుగులో తెరకెక్కిన మూవీ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'.. తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదల అయింది. రాజమౌళి సమర్పణలో వస్తున్న ఈ మూవీ ట్రైలర్ సరికొత్త కథాంశంతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకూ ఆసక్తిగా సాగింది. మాయలు, వింతలు, విశేషాలు, చిన్నారి మ్యాజిక్ ఇలా అనేక అంశాల చుట్టూ ఈ కథ సాగినట్టు తెలుస్తోంది. ఇక ఈ ట్రైలర్ కు బాలకృష్ణ వాయిస్ ఓవర్ ఇవ్వడం మరో క్రేజీ పాయింట్ అని చెప్పొచ్చు. బాలయ్య తన దైన శైలిలో వాయిస్ ఓవర్ తో ఈ ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. దాంతో ట్రైలర్ పై ఆసక్తి పెరిగింది.అనగనగా ఒక ఊరిలో ఒక నక్క ఉండేది. దానికి రెండు విషయాలు చాలా బాగా తెలుసు.. ఒకటి డబ్బులు.. రెండు ట్రబుల్.. ఎక్కడ డబ్బులున్నా అది వాసనతో పసిగట్టేసేది. ఎక్కడ ట్రబుల్ ఉన్నా అది తప్పించుకుని పారిపోయేది. ఒకరోజు డబ్బులు.. ట్రబుల్ ఒకేసారి ఎదురయ్యాయి. నక్కకి డబ్బులు మాత్రమే కనిపించాయి.. దాని పక్కనే ఉన్న ట్రబుల్ కనిపించలేదు.. అని బాలకృష్ణ ఇచ్చిన వాయిస్ ఓవర్ ట్రైలర్ కే హైలెట్ గా నిలిచింది. ఇక ట్రైలర్ చూస్తుంటే ఇది ఫాంటసీ కామెడీ ఎంటర్ టైనర్ అని తెలుస్తోంది. ట్రైలర్ ప్రకారం ఈ మూవీలో ఫహద్ ఓ మెజిషియన్ గా అలరించనున్నారు. ఈ క్రమంలోనే ఓ అనాథ పాపతో అతడికి పరిచయం ఏర్పడింది.. ఆ తర్వాత హీరోతో పాపకు ఉన్న సంబంధం ఏంటి..? పాపకు కొన్ని ప్రత్యేకమైన శక్తులు ఎలా వచ్చాయి..? ఆ శక్తుల వల్ల హీరోకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి..? ఇలాంటి ఆసక్తికర అంశాలతో ట్రైలర్ సాగింది.

# CINEMA

## ఓ వారం ఆలస్యంగా ఆదర్శకుటుంబం



47'.. అనే ప్రకటన విడుదలైన నాటినుంచీ సినిమాపై ఆడియన్స్‌లో పాజిటివ్ బజ్ మొదలైంది. అత్యంత వినోదాత్మకంగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ముందు ఈ సినిమాను అక్టోబర్ 2న విడుదల చేయాలనుకున్నారు. అయితే.. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ చిత్రాన్ని ఓ వారం ఆలస్యంగా, అనగా.. అక్టోబర్ 9న విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ప్రేక్షకులకు సంపూర్ణమైన వినోదానుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే సినిమా రిలీజ్‌ను వారం రోజులు వాయిదా వేశామని, వినోదం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనమే ఈ సినిమా అని చిత్రబృందం పేర్కొన్నది. మధ్యతరగతి వ్యక్తిగా వెంకటేశ్ నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధిశెట్టి కథానాయిక. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావురమేశ్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ కీలకపాత్రధారులు.

# బ్లడ్ బ్యాంక్‌పై ఆరోపణలు..



### తొలిసారి స్పందించిన చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి సాధారణంగా తనపై వచ్చే విమర్శలు, ఆరోపణలపై బహిరంగంగా స్పందించేందుకు పెద్దగా ఆసక్తి చూపించరు. ఎలాంటి వివాదం ఎదురైనా సంయమనంతో వ్యవహరిస్తూ తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. అయితే తాజాగా జరిగిన మెగా యూత్ ఫోర్స్ అభిమానుల సమావేశంలో మాత్రం తన మనసులోని బాధను అభిమానులతో పంచుకున్నారు. ముఖ్యంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌పై కొంతకాలంగా వస్తున్న ఆరోపణలపై ఆయన నేరుగా స్పందించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.తన సినీ జీవితంలో ఎన్నో విమర్శలు, అవమానాలు ఎదుర్కొన్నానని చిరంజీవి ఈ సందర్భంగా పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తనపై ఎలాంటి విమర్శలు వచ్చినా వాటిని పెద్దగా పట్టించుకోనని, అయితే సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సేవా కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం జరగడం మాత్రం తనను బాధిస్తుందని ఆయన అన్నారు.తన బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తాన్ని విక్రయిస్తున్నారంటూ కొందరు చేస్తున్న ప్రచారంపై చిరంజీవి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి ఆరోపణలు పూర్తిగా అర్థరహితమని ఆయన స్పష్టం చేశారు. తాను సినిమాల్లో సంపాదించే పారితోషికంతో సమానమైన మొత్తాన్ని రక్తాన్ని విక్రయించడం ద్వారా సంపాదించాలంటే ఎన్ని రక్తపు ప్యాకెట్లు విక్రయించాల్సి ఉంటుందో ఒక్కసారి ఆలోచించాలని కామెంట్ చేశారు.ఏదైనా ఆరోపణ చేసే ముందు కనీసం వాస్తవాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. తప్పుడు ప్రచారం వల్ల సేవా కార్యక్రమాల ఉద్దేశం దెబ్బతినడంతో పాటు, రక్తదానం చేయడానికి ముందుకొచ్చే వారిలో కూడా అపోహలు ఏర్పడే అవకాశం ఉందని ఆయన మాటల ద్వారా స్పష్టమైంది. చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌ను ఎలాంటి విరాళాలపై ఆధారపడకుండా తన సొంత సంపాదనతోనే నిర్వహిస్తున్నానని చిరంజీవి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించేందుకు ఈ సంస్థ పనిచేస్తోందని చెప్పారు. ఈ సేవా కార్యక్రమం కొనసాగడంలో మెగా అభిమానుల పాత్ర కూడా ఎంతో కీలకమని చిరంజీవి పేర్కొన్నారు. అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం వల్లే అవసరమైన వారికి రక్తాన్ని అందించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో అభిమానులు ముందుండటం తనకు ఎంతో గర్వకారణమని అన్నారు.

తనపై వ్యక్తిగతంగా ఎన్ని విమర్శలు వచ్చినా వాటిని భరించగలనని చిరంజీవి అన్నారు. అయితే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను కూడా రాజకీయాలు, వ్యక్తిగత విమర్శలతో ముడిపెట్టడం మాత్రం బాధ కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.సమాజానికి ఏదైనా మంచి చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమాలపై అపోహలు సృష్టించడం వల్ల వాటి అసలు ఉద్దేశం ప్రజలకు చేరకుండా పోయే అవకాశం ఉంటుందని చిరంజీవి వ్యాఖ్యల ద్వారా తెలుస్తోంది. అందుకే ఈసారి అభిమానుల సమక్షంలో తన మనసులోని బాధను పంచుకున్నట్లు ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయి.చిరంజీవి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ చర్చకు దారితీశాయి. సాధారణంగా విమర్శలకు స్పందించకుండా ముందుకు సాగే చిరంజీవి.. ఈసారి మాత్రం బ్లడ్ బ్యాంక్‌పై వస్తున్న ఆరోపణలకు వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన సేవా కార్యక్రమాల వెనుక ఉన్న ఉద్దేశాన్ని, అభిమానుల సహకారాన్ని వివరిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ సమావేశంలో ప్రత్యేకంగా నిలిచాయి.



## ప్యారడైజ్‌లో అన్నీ సర్‌ప్రైజ్‌లే!



'ఇందులో నా పేరు సుబ్బలక్ష్మి. అంతా సుబ్బు అని పిలుస్తుంటారు. జడల్ జర్నీలో లవ్ పార్టనర్‌గా కనిపిస్తాను. అలాగే నాకంటూ ఓ జర్నీ ఉంటుంది. అది చాలా భిన్నంగా ఉంటుంది. ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. అవన్నీ బిగ్ స్క్రీన్ మీదే చూడాలి' అని కథానాయిక కయాదు లోహర్ అన్నారు. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'ది ప్యారడైజ్' సినిమాలో ఆమె కథానాయిక. చెరుకూరి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం కయాదు లోహర్ విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు.కొ'నాది ఇందులో నటనకు అవకాశం ఉన్న పాత్ర. కథలో కూడా కీలకంగా ఉంటుంది. ఆ పాత్ర గురించి ఇప్పుడే రివీల్ చేయలేను. నాని, శ్రీకాంత్ ఓదెల, అనిరుధ్ లాంటి టీమ్ పనిచేసిన సినిమాలో భాగం కావడం గొప్ప అనుభవం. 'డ్రాగన్' చూశాకే ఈ పాత్ర నేను చేయగలనని శ్రీకాంత్ నమ్మారు. టెస్ట్‌లుక్ చేసి నన్ను సెలక్ట్ చేశారు.ఇది నా కెరీర్‌లోనే పెద్ద ప్రాజెక్ట్' అని కయాదు తెలిపారు. జడల్‌గా నాని విశ్వరూపాన్ని ఇందులో చూస్తారని, ఆయనలాంటి స్వీట్, హంబుల్ పర్సన్‌తో కలిసి పనిచేయడం అదృష్టమని, శ్రీకాంత్ ఓదెల విజన్ ఉన్న అరుదైన దర్శకుడని, నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించారని కయాదు పేర్కొన్నారు.

## ఎనిమిదేళ్ల కథకు కొత్తరూపం?



సూర్య కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో ఓ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ప్రస్తుతం మణిరత్నం విజయ్ సేతుపతి, సాయిపల్లవి జంటగా రొమాంటిక్ డ్రామా 'ఇంజివెల్లం' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత ఆయన సూర్యతో సినిమా చేయబోతున్నారని ప్రచారం జరుగుతున్నది. దాదాపు ఎనిమిదేళ్ల క్రితమే మణిరత్నం సూర్యకు ఓ కథను వినిపించారట. అప్పట్లో ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. అదే స్క్రిప్ట్‌లో అవసరమైన మార్పులు చేర్పులు చేసి సూర్యకు మరోసారి వినిపించే యోచనలో మణిరత్నం ఉన్నారని తెలిసింది. సూర్య అంగీకరిస్తే ఓ సినిమా పట్టాలెక్కే అవకాశముంది. గతంలో మణిర త్నం-సూర్య కాంబినేషన్‌లో 'ఆయుధ ఎళుత్తు' అనే సినిమా రూపొందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 'నవరస' ఆంథాలజీలో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఈ నేపథ్యం లో వీరిద్దరి తాజా సినిమాపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.

# మళ్లీ కొత్త కాన్సెప్ట్‌తో




యువ హీరో హర్ష్ రోషన్ కోర్ట్ మూవీతో ఎంతో క్రేజ్ సంపాదించుకున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో శ్రీదేవి- హర్ష రోషన్ మధ్య కెమిస్ట్రీకి యూత్ బాగా కనెక్ట్ అయ్యారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. దాంతో హర్ష్ రోషన్ ఇటీవలికాలంలో వరుసబెట్టి సినిమాలు చేస్తున్నాడు. కోర్ట్ తర్వాత బ్యాండ్ మేళం సినిమా చేశాడు. ఈ మూవీ కూడా యూత్ ను బాగానే ఆకట్టుకుంది. కోర్ట్ మూవీ జంట ఈ సినిమాలో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు 'తెల్ల కాగితం' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు వచ్చాడు హర్ష్ రోషన్. ఈ మూవీ ట్రైలర్ తాజాగా విడుదలైంది. ట్రైలర్ చాలా రీఫ్రెషింగ్ గా ఉంది. 2006 లో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ మొదట్లోనే తెలిపారు. ట్రైలర్ లో హర్ష్ రోషన్ ఇన్నోసెంట్ డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. తెలిసీ తెలియని వయసులో మీరు చేసే ఒక చిన్న తప్పు తెల్ల కాగితం మాదిరిగా ఉన్న మీ జీవితాల్ని నాశనం చేస్తుంది అనే డైలాగ్ ఆకట్టుకుంది. కమింగ్ ఏజ్ రొమాన్స్ డ్రామాతో పాటు ఇంటెన్స్ గా స్టోరీని నడిపిన తీరు అద్భుతంగా ఉంది. ట్రైలర్ చూస్తుంటే హర్ష్ రోషన్ కు కోర్ట్ మూవీ రేంజ్ లో హిట్ గ్యారంటీ అనిపిస్తోంది. ఇక ఈ మూవీ అక్టోబర్ 2న విడుదల కానుంది. అయితే విశేషం ఏంటంటే.. ? ఈ ట్రైలర్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నూ ఆకట్టుకుంది. దాంతో ఆయన తన ఇన్ స్టా గ్రామ్ స్టేటస్ గా ఈ మూవీ ట్రైలర్ లింక్ ను పెట్టారు. ఈ క్రమంలో చిన్న సినిమాలను ప్రామోట్ చేయడంలో ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారనేది మరోసారి స్పష్టమైంది. ఇక తెల్ల కాగితం మూవీతో నక్షత్ర అనే కొత్త హీరోయిన్ టాలీవుడ్ కు పరిచయం అవుతుంది. ఈమె తెలుగు అమ్మాయి కావడం విశేషం. ట్రైలర్ లో హర్ష్ రోషన్- నక్షత్ర మధ్య లవ్ సీన్స్ చాలా ఇన్నోసెంట్ గా రీఫ్రెషింగ్ గా ఉన్నాయి. ఈ చిత్రానికి రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహించారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ పై కృష్ణ కొమ్మాలపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. తెల్ల కాగితం సినిమాకు రచన నందు సవిరిగాన అందించారు. అలాగే కెమెరామెన్ గా కేవీ గుహన్ వ్యవహరించారు. ఇక సంగీతం విజయ్ బుల్గానిన్ అందించారు. అక్టోబర్ 2 న విడుదల కానున్న ఈ మూవీ ప్రేక్షకుల్ని ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.